STV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 19 | సంచిక: 85 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 10 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |




28 నుంచి ఏప్రిల్ 2 వరకు

## బడ్జెట్ సమావేశాలు

తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

29న ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టనున్న కేంద్రం

యధావిధిగా ఫిబ్రవరి 1ననే బడ్జెట్ ప్రసంగం

.. వివరాలు 3లో

స్లీపర్ బస్సు ప్రమాదాల

## నివారణకు చర్యలు

గుర్తింపు పొందిన సంస్థలకే తయారీ పనులు

గతేడాది ప్రమాదాలతో కేంద్రం నిర్ణయం

.. వివరాలు 3లో

## ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బలు

పోలీస్ అధికారులకు లొంగిపోయిన మరో 63మంది

.. వివరాలు 3లో



# జల వివాదాలొద్దు

## సమస్యను మనమే పరిష్కరించుకుందాం

ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులకు అడ్డం పడకండి

- జలవివాదాలతో రాజకీయ ప్రయోజనం కోరుకోం
- సమస్యలను మనమే కలిసి పరిష్కరించుకుందాం
- ఏపీ సీఎం చంద్రబాబుకు సీఎం రేవంత్ సూచన
- కృష్ణా జలాలపై ఏపీతో చర్చలకే ప్రాధాన్యం
- రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవం



**హైదరాబాద్, జనవరి 9:** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించు కోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా.

మిగతా 2 లో



## గ్లోబల్ డెస్టినేషన్‌గా తెలంగాణ

2047 లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ : రేవంత్ రెడ్డి

2

## ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక



3

## శబరిమల ప్రధాన పూజారి అరెస్టు

- శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం

4



సంస్కృతి, సంప్రదాయాలను

## కాపాడుకోవాలి



5

పండగల విశిష్టతను బాగా చాటాలి

సంక్రాంతి అంటే నాకు ఎంతో ఇష్టం

ఇందిర పుణ్యమా అని రాజకీయాల్లోకి వచ్చా

సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యనాయుడు





మన భూములపై

# రాజముద్ర

మీ భూమి - మీ హక్కు.. ఆయన ఫొటో ఎందుకు?

కరోనా సమయంలో అన్నం పెట్టారు

వివాదాస్పద చట్టాన్ని రద్దు చేస్తూనే రెండో సంతకం

ఇకపై రికార్డులను ట్యాంపర్ చేయకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భద్రత

రాయవరంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

**కాకినాడ :** కరోనా సమయంలో నూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదన్నారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని.. 'మీ భూమి - మీ హక్కు' అని

మిగతా 5 లో

## కోనసీమ గ్యాస్ లీక్‌పై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

కోనసీమ ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు మంటలు

ఘటనాస్థలిని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

5లో

రచ్చకెక్కిన బెంగాల్

## రాజకీయం

ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఈడీ చర్యలపై మమతా నిరసన ప్రదర్శన

మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బీజేపీ

విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఈడీ పిటిషన్

4





## డీజీపీకి హైకోర్టులో ఊరట

- నియామకంపై సవాల్ పిటిషన్ కొట్టివేత

2

## మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- డీసీఎం, ట్యాంకర్ ఢీకొనడంతో ముగ్గురు మృతి



3



## సీనియర్ జర్నలిస్టు ఫజల్ మృతి

3



## గోట్ బ్లడ్ మాఫియా

మేక రక్తం సేకరిస్తున్న మటన్ షాపుపై కేసు నమోదు

ఈ నెల 4న నాగారంలోని మటన్ షాపుపై పోలీసులు దాడులు చేయగా, 130 ప్యాకెట్ల మేకల రక్తం లభించింది. అయితే ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్‌కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్ లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

2




# ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బలు

## పోలీస్ అధికారులకు లొంగిపోయిన మరో 63మంది

**రాయ్‌పూర్, జనవరి 9:** ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులు తున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులు ఎదుట 63 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 18 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ కడ్తీ.. తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న ఆయుధాలను పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. లొంగిపోయిన మొత్తం మావోయిస్టులపై రూ. కోటి రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లోన్ వర్రాటు (ఇంటికి తిరిగి రండి) ప్రచారంలో భాగంగా వీరంతా లొంగిపోయి నట్లు పోలీసులు తెలిపారు. మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలిస్తామని కేంద్ర ప్రకటించింది. అందుకోసం ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో దాదాపుగా మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. చివరకు ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రభావం కొంత మేర ఉంది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా మావోయిస్టుల ఏరివేతకు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే వేలాది మంది మావోయిస్టులు ఇప్పటికే ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఇలా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన రివార్డులను అందజేస్తోంది. అదీకాక.. మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగం కావాలంటూ ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వం చేపట్టిన కూంబింగ్‌లో పలువురు అగ్రనేతలు ఎన్‌కౌంటర్‌కాగా.. కీలక నేతలు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు.

# డీజీపీ శివధర్‌కి హైకోర్టులో ఊరట

## నియామకంపై సవాల్ పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్, జనవరి 9 :** తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. డీజీపీ నియామక ఉత్తర్వులను సస్పెండ్ చేయాలన్న పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా శివధర్‌రెడ్డిని డీజీపీగా నియమించారంటూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త టి.మధన్‌గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం డీజీపీ నియామక ఉత్తర్వులపై స్టే విధించడానికి నిరాకరించింది.రెగ్యులర్ ప్రాసెస్‌ను 4 వారాల్లో పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఐఖాఅ) ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. యూపీఎస్‌సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.

# గోట్ బ్లడ్ మాఫియా వ్యవహారం

## మేక రక్తం సేకరిస్తున్న మటన్ షాపుపై కేసు నమోదు

**మేడ్చల్, జనవరి 9:** జంతువుల నుంచి రక్తం సేకరణ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ వాణి ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూగజీవుల నుంచి రక్తం తీసేందుకు ఎలాంటి అనుమతి పొందలేదని పోలీసులు గుర్తించారు. సోను మటన్ అండ్ చికెన్ షాప్‌పై కేసు నమోదు చేశారు పోలీసులు. ఈ వ్యవహారంపై వెటర్నరీ అధికారులు ఇచ్చిన నివేదికను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. కాగా.. సోను మటన్ షాప్‌లో జీవించి ఉన్న మేక నుంచి రక్తం సేకరించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ నెల 4న నాగారంలోని సోను మటన్ షాపుపై కీసర పోలీసులు దాడులు చేయగా.. 130 ప్యాకెట్ల మేకల రక్తం లభించింది. మేకల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్‌కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్‌లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ 'గోట్ బ్లడ్ మాఫియా' ఎలాంటి వైద్య ప్రమాణాలూ పాటించకుండా మేకలు, గొర్రెల నుంచి అక్రమంగా రక్తం సేకరించి, దాన్ని ప్లేట్‌లెట్ల తయారీకి తరలిస్తుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# నటుడు నవదీప్‌కు హైకోర్టులో ఊరట

## డ్రగ్స్ కేసును కొట్టేసిన తెలంగాణుని న్యాయస్థానం



**హైదరాబాద్, జనవరి 9 :** టాలీవుడ్ యంగ్ హీరో నవదీప్‌నకు హైకోర్టులో భారీ ఉపశమనం కలిగింది. అతడిపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణా న్యాయస్థానం కొట్టివేసింది. నవదీప్ వద్ద డ్రగ్స్ ఉన్నట్టు ఎలాంటి ఆధారాలు లభించలేదనే ఆయన తరఫు న్యాయవాది వెంకట సిద్దార్థ్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ కేసును కొట్టివేస్తున్నట్టు పేర్కొంది. దీంతో ఈ యంగ్ హీరోకు పూర్తిస్థాయిలో ఉపశమనం లభించినట్లైంది. కొద్ది నెలల క్రితం.. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులో హీరో నవదీప్ పేరు వినిపించడంతో ఆయన డ్రగ్స్ తీసుకున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. అందులో భాగంగా.. గుడిమల్కాపూర్‌లో నమోదైన కేసులో ఎఫ్ఐఆర్‌లో అతడి పేరు నమోదైంది. ఈ ఆరోపణలపై నవదీప్ ఘాటుగా స్పందించారు. తనకు, డ్రగ్స్‌కు ఎలాంటి సంబంధం లేదని అతను వాపోయాడు. ఈ నేపథ్యంలోనే తనను అరెస్ట్ చేయొద్దంటూ అతను గతంలో తెలంగాణా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ పిటిషన్ను విచారించిన న్యాయస్థానం.. అరెస్ట్ చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఈ కేసుపై మరోసారి విచారణ చేపట్టింది న్యాయస్థానం. నవదీప్ పేరును కేవలం ఎఫ్ఐఆర్‌లోనే చేర్చారని.. అతను డ్రగ్స్ తీసుకున్నట్టు ఆధారాలేవీ లేవని స్పష్టం కావడంతో ఈ కేసును కొట్టివేసింది.

# గ్లోబల్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- 2047 లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- క్యూర్-ప్యూర్-రేర్‌తో డెవలప్‌మెంట్ మోడల్
- గ్లోబల్ ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 9:** హైదరాబాద్ నగరం నేడు ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడుతోందంటే అది గత మూడు దశాబ్దాల నిరంతర శ్రమ ఫలితమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఐవీ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన సుజెన్ మెడికేర్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఇటువంటి తయారీ యూనిట్లు రావడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం క్యూర్ , ప్యూర్ , రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు సీఎం తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇప్పటికే తెలంగాణ పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమిగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం వాటా తెలంగాణదేనని, ఫార్మా రంగంలో ప్రపంచమే మన వైపు చూసేలా ఎదుగుతున్నామని గర్వంగా చెప్పారు. ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం మన రాష్ట్రంలో ఉంది. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన దేశం వాళ్లే అని సీఎం అన్నారు. రాజకీయ వివాదాల కంటే సమస్యల పరిష్కారానికే తాము ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని, అడ్డంకుల వల్ల కేంద్ర నిధులు రాక రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు.తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలన్నా, నీటి సమస్యలు తీరాలన్నా ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల సహకారం అవసరమని, అందుకే తాము వివాదాల కంటే సామరస్యపూర్వక చర్చలకే మొగ్గు చూపుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల , రైతుల ప్రయోజనాల కోసమే తమ ప్రభుత్వం ఆలోచిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌లోని 'ఫ్యూచర్ సిటీ'లో నివసిస్తున్నామని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జర్మనీ, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాలతో పోటీ పడుతూ తెలంగాణను గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చడమే తమ సంకల్పమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# వివాదాలు కాదు.. పరిష్కారాలు ముఖ్యం

మొదటి పేజీ తరువాయి

మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం అని అన్నారు. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ వేదికగా ఆంధ్రప్రదేశ్



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు

## తొలిరోజు రాష్ట్రపతి ప్రసంగం
## 29న ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టనున్న కేంద్రం
## యధావిధిగా ఫిబ్రవరి 1నే బడ్జెట్ ప్రసంగం

**న్యూఢిల్లీ, జనవరి 9:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తొలి దశ సమావేశాలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండోదశ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఉభయ సభలు సమావేశం అయ్యేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన తేదీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తొలి రోజైన జనవరి 28న రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్నారు. ఏటా మాదిరిగానే ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్జడెట్‌ను సమర్పించనున్నారు. ఆ రోజు ఆదివారం కావడంతో సమావేశ తేదీలపై గత కొన్ని రోజులుగా సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వ తాజా ప్రకటనతో ఆ చిక్కుముడి వీడింది. దీంతో ఆదివారమైఆ బడ్జెట్ యధాతథంగా ప్రవేశ పెడతారు.



# రాజ్యసభలో జూన్‌లో ఐదు ఖాళీలు

## తెలంగాణలో ఇద్దరు, ఏపిలో ముగ్గురు రిటైర్

**న్యూఢిల్లీ, జనవరి 9:** ఈ ఏడాది రిరైట్ అవుతున్న రాజ్యసభ సభ్యుల జాబితాను శుక్రవారం రాజ్యసభ సచివాలయం విడుదల చేసింది. తెలంగాణలో భారాస సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్‌మను సింఘ్వీ ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైకాపా ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, తెదేపా సభ్యుడు సానా సతీష్‌ల పదవీకాలం ఈ ఏడాది జూన్‌తో ముగుస్తుందని రాజ్యసభ సచివాలయం తెలిపింది. ఈమేరకు అన్ని రాష్ట్రాల సభ్యుల పదవీకాలం వివరాలను వెల్లడించింది.

# గుజరాత్‌లో భూకంపం

## 12 మార్లు కంపించిన భూమి
## పరుగులు తీసిన జనాలు

**గాంధీనగర్, జనవరి 9:** గుజరాత్‌లో ఏకంగా 12 మార్లు భూమి కంపించడం కలకలానికి దారి తీసింది. గంటల వ్యవధిలోనే పలుమార్లు భూమి కంపించడంతో ఏం జరుగుతోందో అర్థంకాక జనాలు ఇళ్లల్లోంచి బయటకు పరుగులు చేశారు. రాజ్‌కోట్ జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ పలుమార్లు భూమి కంపించింది. వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.6-3.8 మధ్య నమోదైంది. ఉప్లేటా, ధొరాజీ, జెత్‌పూర్ తాలూకాల్లో ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. గురువారం రాత్రి 8.42 గంటల ప్రాంతంలో తొలిసారి భూమి కంపించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూకంప కేంద్రం ఉప్లేటా టౌన్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. దీంతో, పరిసరాల్లోని మూడు తాలూకాల్లో ప్రజలు భయకంపితులు అయ్యారు. ఏం జరుగుతోందో అర్థంకాక ఇళ్లల్లోంచి పరుగులు తీశారు. భారీ కట్టడాలు ఏవీ లేని మైదాన ప్రాంతాలకు పరుగు తీశారు. అయితే, ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. పాత భవనాల్లో నిర్వహిస్తున్న స్కూళ్లు, కాలేజీలకు జిల్లా యంత్రాంగం ముందుజాగ్రత్త చర్యగా సెలవు ప్రకటించింది. ఇలా వరుస పెట్టి స్వల్పస్థాయి భూప్రకంపనలు సంభవించడాన్ని స్వార్మ్ టైప్ భూకంపంగా పిలుస్తారని అధికారులు చెబుతున్నారు. భూమి పొరల్లో అప్పటికే ఉన్న చీలికల మధ్యకు నీరు చేరి ఒత్తిడి తీవ్రమైనప్పుడు ఇలా భూమి పలుమార్లు కంపిస్తుందని వివరించారు. స్వార్మ్ టైప్ భూకంపాలు సంభవించినప్పుడు ఎలాంటి ప్రమాదం ఉండదని కూడా తెలిపారు.



# ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు



## ● ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక

**హైదరాబాద్, జనవరి 9:** మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ కుట్రల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమే కాపాడటమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. మీరు చెబుతున్న మొహబ్బత్ కి దుకాణం ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థులను వారి భూములను తీసుకొని రోడ్డుమీద వేయడమేనా? అని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి కానీ వారి భూములు గుంజుకుంటున్న తమ ప్రభుత్వంపై స్పందించకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. యూనివర్సిటీలో ఉన్న భూములు ఖాళీగా ఉన్నవి కావు భవిష్యత్తు విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రతిష్టను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఇదే యూనివర్సిటీ ప్రజా అవసరాల కోసం హైదరాబాద్ నగరం కోసం 32 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఇచ్చారని, ఖాజాగూడ నుంచి నానక్ రామ్ గూడ కు లింక్ రోడ్డు కోసం ఏడెకరాల స్థలాన్ని యునివర్సిటీ భూమి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏనాడు కూడా హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఏనాడు వ్యతిరేకించలేదని చెప్పారు. గతంలో తెలంగాణలో జరిగిన ఉద్యమం వల్లనే హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాలు త్యాగాల ఆధారంగా ఏర్పడిన యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమని మండిపడ్డారు. గతంలో మేము నిజాం కాలేజీలో హాస్టల్ లేదు అంటే ప్రభుత్వ నిధులతో హాస్టల్ కట్టించామని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కావలసిన విస్తరణ సౌకర్యాలకు నిధులు కూడా కేటాయించి అండగా నిలబడతామని భరోసానిచ్చారు.

# సీనియర్ జర్నలిస్టు ఫజల్ మృతి



**హైదరాబాద్, జనవరి 9:** సీనియర్ జర్నలిస్టు ఫజల్ రహ్మాన్ మొహమ్మద్(65) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో కుటుంబసభ్యులు, సన్నిహితులు, సహచరులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దిశ తదితర పత్రికల్లో వివిధ హోదాల్లో దాదాపు 38 సంవత్సరాలకు పైగా పని చేసిన ఆయన, ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 'ప్రతిపక్షం' దినపత్రికను నిర్వహిస్తున్నారు. ఫజల్ హఠాత్తుగా క్యాన్సర్ కాటుకు గురై ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం అని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలో ఏపీయుడబ్ల్యూజేకి, ప్రత్యేక రాష్ట్రంలో టీయూడబ్ల్యూజే సంఘాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం అని తెలిపింది. వారం రోజుల క్రితం నిమ్స్ ఆసుపత్రిలో చేరిన ఫజల్ కు మెరుగైన చికిత్స అందేలా ఎంతో కృషి చేసినప్పటికీ ఫలితం దక్కలేదని టీయూడబ్ల్యూజే పేర్కొంది. గత కొంతకాలంగా ఆర్థిక కష్టాలను అనుభవిస్తున్న ఫజల్ రహ్మాన్ కుటుంబానికి టీయూడబ్ల్యూజే అండగా నిలిచి, ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తుందని తెలిపింది. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బొడిగె బసవపున్నయ్య సైతం ఫజుల్ రహ్మాన్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రాంనారాయణ, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) కరీంనగర్‌అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె చంద్రశేఖర్‌తో పాటు వివిధ పత్రికల ఎడిటర్లు, సీనియర్‌రిపోర్టర్లు ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కాగా, ఫజల్ రెహ్మాన్ స్వస్థలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్. వృత్తి రీత్యా ఆయన హైదరాబాద్ లో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

# అదేపనిగా నెహ్రూపై విమర్శలు తగవు


## భారత ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడు పండిట్ నెహ్రూపై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు



**తిరువనంతపురం,జనవరి 9:** కాంగ్రెస్ విధానాలను విమర్శిస్తూ బీజేపీకి దగ్గరవుతున్నారంటూ కొంతకాలంగా విమర్శలను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ తాజాగా భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నెహ్రూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడని కొనియాడారు. అయితే నెహ్రూపై తన అభిమానం గుడ్డిది కాదని అన్నారు. నెహ్రూ పొరపాట్లు చేసి ఉండొచ్చని, అయితే దేశంలోని అన్ని సమస్యలకూ ఆయనే కారణమంటూ నిందించడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. నెహ్రూ వారసత్వంపై బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై కేరళ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఇంటర్నేషన్ బుక్ ఫెస్టివల్‌లో లో శశిథరూర్ మాట్లాడారు. 'నేను నెహ్రూ అభిమానిని. అయితే ఆయన నమ్మకాలు, విధానాలన్నింటికీ గుడ్డిగా తలాడించను. ఆయన ఆలోచనా దృక్పథం ప్రశంసనీయమైంది. ఆయన తీసుకున్న అనేక చర్యలు ప్రశంసలకు అర్హమైనవి. ముఖ్యంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఆయన దృఢంగా నెలకొల్పారు. అలా అని వారు (మోదీ ప్రభుత్వం) ప్రజాస్వామి వ్యతిరేకులని కాదు. అయితే నిశ్చయంగా వారు నెహ్రూ వ్యతిరేకులు. సమస్య ఏదైనా నెహ్రూను వారు విమర్శలు చేస్తూనే ఉన్నారు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఇండియా-చైనా మధ్య 1962లో జరిగిన యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, కొన్ని కేసుల్లో మోదీ ప్రభుత్వం విమర్శలకు ఆధారాలుండవచ్చని, ఆ యుద్ధంలో చైనాపై ఓటమికి నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు కారణం కావచ్చని అన్నారు. అయితే సమస్య ఏదైనా ప్రతిదానికి వాళ్లు నెహ్రూను నిందించడం మాత్రం సరికాదని అన్నారు. చయితగా తన జర్నీని ప్రస్తావిస్తూ, చిన్నప్పుడు ఆస్తమా కారణంగా తాను పుస్తకాలు చదవడాన్ని ఎక్కువగా ఇష్టపడేవాడినని, అప్పుడు టెలివిజన్ కానీ, మొబైల్ ఫోన్లు కానీ లేవని, పుస్తకాలే తన సహచరులని థరూర్ చెప్పారు. చాలా చిన్నప్పుడే తాను తొలి నవల రాశానని, అయితే సిరా ఒలికపోవడంతో ఆ పుస్తకాన్ని కోల్పోయానని తెలిపారు. శ్రీ నారాయణ్ గురు బయోగ్రఫీ తన 28వ పుస్తకమని చెప్పారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పుస్తక పఠనం తగ్గిపోయిందని, కానీ కేరళలో మాత్రం రీడింగ్ కల్చర్ కొనసాగుతోందన్నారు.

# గతేడాది మోడీ, ట్రంప్ మధ్య 8సార్లు ఫోన్ కాల్స్

## వాణిజ్య మంత్రి హాళవార్డ్ లుట్నిక్ కామెంట్‌పై రణ్‌దీప్ జైస్వాల్



**న్యూఢిల్లీ, జనవరి 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని మోదీ ఫోన్ చేయకపోవడంతో వాణిజ్య ఒప్పందం కుదరలేదంటూ అమెరికా వాణిజ్య మంత్రి హాళవార్డ్ లుట్నిక్ తాజాగా చేసిన కామెంట్స్ ప్రస్తుతం కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. గతేడాది మోదీ, ట్రంప్ 8 సార్లు మాట్లాడుకున్నారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం తెలిపారు. ఆ కామెంట్స్ మా దృష్టికి వచ్చాయి. గతేడాది ఫిబ్రవరి 13 నుంచి భారత్, అమెరికా దేశాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు కృషి చేస్తున్నాయి. నాటి నుంచీ ఇరు దేశాల బృందాలు పలుమార్లు చర్చలు జరిపాయి. పరస్పర ఆమోదయోగ్యమైన ఒప్పందం కోసం ప్రయత్నిస్తు న్నాయి. చాలా సందర్భాల్లో ఒప్పందంపై చర్చలు తుది వరకూ వెళ్లాయి. అయితే, ఈ చర్చలపై వస్తున్న వార్తలు పూర్తిగా వాస్తవం కాదు' అని రణ్‌ధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో అన్నారు. గతేడాది ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఏకంగా 8 సార్లు మాట్లాడుకున్నారని చెప్పారు. ఇరు దేశాల భాగస్వామ్యానికి సంబంధించి వివిధ అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయని తెలిపారు. భారత్, అమెరికా దేశాలకు ఆమోదయోగ్యమైన వాణిజ్య ఒప్పందం కోసం తాము కట్టుబడి ఉన్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. ఇరు దేశాధినేతల మధ్య పరస్పర గౌరవంతో కూడిన స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని కూడా చెప్పారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్‌నకు కాల్ చేయకపోవడంతో భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరలేదని అమెరికా వాణిజ్య మంత్రి హాళవార్డ్ లుట్నిక్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఓ పాడ్ కాస్ట్‌లో గురువారం ఆయన ఈ కామెంట్స్ చేశారు. 'ఒప్పందం దాదాపుగా ఓ కొలిక్కి వచ్చింది. చివర్లో ప్రధాని మోదీ, ట్రంప్‌నకు కాల్ చేయాల్సి ఉంది. ఇది భారత ప్రభుత్వానికి రుచించలేదు. చివరకు ప్రధాని మోదీ కాల్ చేయలేదు' అని లుట్నిక్ కామెంట్ చేశారు.



# మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## డీసీఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో ముగ్గురు మృతి

**నల్లగొండ, జనవరి 9:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఈదులగూడ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు టైల్స్ తరలిస్తున్న డీసీఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలోని మృతులంతా బీహార్ వాసులుగా గుర్తించారు. వీరిలో బీరు బాయ్ (30), సంతోష్ (30), సూరజ్ (18) ఉన్నారు. డీసీఎంలో ఉన్న టైల్స్ కూలీల మీద పడటంతో ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.టైల్స్‌ను హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్రేన్ సహాయంతో రహదారిపై నుంచి లారీని, డీసీఎంను తొలగించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్థంభించిపోయింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేస్తున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మిర్యాలగూడలోని ఈ రహదారిపై ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచించారు. పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# హిమాచల్‌లో ఘోర ప్రమాదం

## లోయలో పడ్డ ప్రైవేట్ బస్సు..8మంది దుర్మరణం



**సిమ్లా,జనవరి 9 :** హిమాచల్‌ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లాలో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు బస్సు లోయలో పడి 8 మంది ప్రయాణికులు మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కుప్వీ నుంచి సిమ్లాకు బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 30 నుంచి 35 మంది ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం హరిపుర్ధార్ ఏరియాలోని ఇరుకైన రహదారిపై వెళ్తుండగా బస్సు అదుపుతప్పి లోయలో పడింది. సహాయక కార్యక్రమాలు చేపట్టినట్టు సిర్మౌర్ ఎస్పీ నిశ్చింత్ సింగ్ నెగి తెలిపారు. తొలుత ప్రమాద స్థలికి చేరుకున్న స్థానికులు అత్యవసర సహాయక బృందాలు అక్కడికి చేరుకోకముందే సహాయక చర్యలు చేపట్టారు. పలువురు క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. మరికొందరికి సీరియస్‌గా ఉండటంతో హైయర్ మెడికల్ సెంటర్లకు తరలిస్తున్నట్టు నిశ్చింత్ సింగ్ చెప్పారు. కాగా, ఈ ఘటనపై ముఖ్యమంత్రి సుఖేందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్టు చెప్పారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు చర్యలు



**హైదరాబాద్, జనవరి 9:** మహిళలు, చిన్నారుల భద్రత కోసం సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈ వారం పలు విస్తృత చర్యలు చేపట్టామని డీసీపీ సృజన కరణం తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదు చేసి 215 మంది పిల్లలను, అంటే 200 మంది బాలురను మరియు 15 మంది బాలికలను విజయవంతంగా రక్షించగలిగారు . సైబరాబాద్ షీ టీం బృందాలు ఈ వారంలో మొత్తం 127 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 59 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 63 ఖ।బిబా కేసులు నమోదు కాగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ చేశారు. అదేవిధంగా, మహిళల నుండి అందిన 17 ఫిర్యాదులను షీ టీం బృందాలు స్వీకరించాయన్నారు. భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలును పరిష్కరించే దిశగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు కేంద్రాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా 31 కుటుంబాలను తిరిగి కలిపి, వారి కుటుంబాల్లో వెలుగులను నింపారు. సైబరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం బృందాలు మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మహిళలను వేధించడం, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, మహిళలను నిరంతరం వెంబడించడం, భిక్షాటన, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. మొత్తం 6,615 మందికి అవగాహన కల్పించామన్నారు. అలాగే మహిళల హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100, నేరాల నివారణ కోసం 1930 వంటి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించామన్నారు.



సంపాదకీయం

# ప్రాజెక్టుల్లో మునిగిపోతున్న నిర్వాసిత జీవితాలు

పోలవరం కావచ్చు...మల్లన్న సాగర్ కావచ్చు లేదా కొండపోచమ్మ సాగర్ కావచ్చు లేదా..గతంలో గంగవరం పోర్టు కావచ్చు..ప్రాజెక్టులు ఏవైనా త్యాగం ప్రజలది, భోగం కార్పోరేట్లది అవుతోంది. వేలకోట్లు పెట్టి ప్రభుత్వాలు కట్టించే ప్రాజెక్టులు సైతం కార్పోరేట్లకు ధారదత్తం చేస్తున్నారు. భూముల సేరణ, ఇళ్లను సేకరించడం తరవాత వారికి కబుర్లు చెప్పడం ఆ తరవాత వారి త్యాగాలను మరచిపోతున్నారు. గంగవరం పోర్టు కోసం త్యాగం చేసిన మత్స్యకారులు రోడ్డున పడ్డారు. పోర్టును పొందిన ఆదానీ ఒడ్డున పడ్డారు. ఇలా ఏ ప్రాజెక్టు తీసుకున్నా ఇదే చరిత్ర కనిపిస్తుంది. ఘనత వహించిన తెలంగాణ వల్లభుడు కెసిఆర్ హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు భూములు ఇచ్చి, ఊర్లను త్యాగం చేసిన వారు ఆగమయ్యారు. కెసిఆర్, ఆయన అనుయాయులు పొలాలు మాత్రం పచ్చగా తడుస్తున్నాయి. తాజాగా అమరావతి రాజధాని కోసం లక్ష ఎకరాలు సేకరిస్తున్నారు. అయినా పాలకులు భూదాహం తీరడం లేదు. అమరావతిలో భూమి తీసుకున్న రైతులకు అరకొరగానే పరిహారం అందించారు. ప్లాట్లను సక్రమంగా అందించలేదు. బహిరంగంగా వారిపై ప్రశంసలు కురిపించడం తప్పవారికి లబ్ది చేకూర్చడం లేదు. ఇంకా ప్లాట్ల కోసం అక్కడి రైతులు పాట్లు పడుతూనే ఉన్నారు. తాజాగా రెండోదఫా భూసేకరణ మొదలయ్యింది. ఈ అభివృద్ధి ఏ ప్రజల కోసమన్నది పాలకులు ఆలోచన చేయాలి. ప్రజలను ముంచి చేసే పనులు మంచి ఎలా అవుతాయి. పోలవరం సంగతి చూస్తే అక్కడి నిర్వాసితులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇలా దేశవ్యాప్తంగానే కాదు... తెలుగు రాష్ట్రాల్లో ఘనత వహించిన పాలకులు రైతులను నట్టేట ముంచుతున్నారు. పోలవరంలో సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, పునరావాసం లభించని దుస్థితి ఇప్పటికీ కొనసాగడం అత్యంత విచారకరం.ప్రాజెక్టు పూర్తయి అన్ని ప్రాంతాలకు నీరు అందించడం మునక ప్రాంతంలో 1.20 లక్షల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైతేనే సాధ్యమవుతుంది. నిర్వాసితులకు భూమికి భూమిగానీ, ఇల్లు కట్టించడంగానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుగానీ జరగలేదు. కట్టించిన కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు కారుతున్నాయి. శ్మశానాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటివేవీ లేవు. 1986లో ఒకసారి, 2022లో మరోసారి వచ్చిన వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తే మునక ప్రాంతంలో జరిగిన కాంటూరు సర్వే, తరువాత చేపట్టిన లైడార్ సర్వే ఏదీ వాస్తవాలను వెల్లడించడం లేదని రుజువైంది. తాజాగా నిర్వాసితుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తున్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 2017కు ముందు అంచనాల ప్రకారం నిర్ణయించినవి కావడం గమనార్హం. 2017 తర్వాత డ్యామ్ అంచనాలు రెండుసార్లు సవరించారు కానీ నిర్వాసితులకు మాత్రం పాత ప్యాకేజిలే! పెళ్లయిన యువతులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం లేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా ప్యాకేజీ అమలు చేయాలి కదా! నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అయినా ప్యాకేజీ తాజా ధరలకు అనుగుణంగా సవరించి పెంచి ఇస్తుందేమోనని నిర్వాసితులు ఆశిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు వాటి ఊసే ఎత్తుకోలేదు. పర్యటనలో డ్యామ్ నిర్మాణ పనులను ఆమూలాగ్రం పరిశీలించిన ఆయన ముంపు ప్రాంతాలను, పునరావాస కాలనీలను కూడా సందర్శిస్తే బాగుండేది. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరించడానికి, అనేక అవకతవకలను, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి అవకాశం వుండేదని ప్రాజెక్టు బాధితుల భావన. వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల్లోగా అంటే మార్చి నెలకల్లా పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు న్యాయం చేయడానికి కృషి చేయడం లేదు. తీయని మాటలు తప్ప చిత్తశుద్ధ ఇకానరావడం లేదు. జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదించినపుడు ఒకటే దశ. కానీ రాష్ట్ర విభజన చట్టం దాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనడంతో నిర్మాణ బాధ్యత కేంద్రానిదయ్యింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటంతా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే బాధ్యతని, అంటే డ్యాం, ప్రధాన కాలువల నిర్మాణమేనని బుకాయించి, పునరావాస పునర్నిర్మాణ విషయాన్ని దాటవేస్తూ వచ్చింది. ఆ తరువాత ప్రాజెక్టును రెండు దశలుగా మార్పించింది. డ్యాం 41.15 మీటర్ల ఎత్తు వరకు మొదటి దశగానూ, పూర్తి రిజర్వాయర్ మట్టం 45.72 మీటర్లు రెండోదశ అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీలు మారినా అప్పుడు, ఇప్పుడూ కేంద్రం కనుసన్నల్లో నడుచుకుంటున్నవే కనుక తలాడించాయి. అయితే, డ్యాం నిర్మాణం విషయంలో మాత్రం ఇది వర్తించదనీ, నిర్మాణం మొత్తం ఒకటిగానే పూర్తవుతుందని అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రులు చెబుతున్నారు. కాబట్టి నిర్వాసితులను పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా రిజర్వాయర్‌లో నీరు నింపి వెళ్లగొట్టడానికే ఈ కుట్ర. అందుకనే దశలవారీ కాకుండా పూర్తి ఎత్తు వరకూ ఆర్ ఆండ్ ఆర్ మొదట పూర్తి చేశాకనే ప్రాజెక్టు నిర్మాణం అని నిర్వాసితులు ఘోష పెడుతున్నారు. మొదటి దశకు సంబంధించిన 41.15 మీటర్ల పరిధిలోని నిర్వాసితులకు 2027 జనవరికల్లా పునరావాసం పూర్తి చేయనున్నట్లు బుధవారంనాడు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ లెక్కలు చూసినా మొదటి దశకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ అమలు సైతం ఇంకా ఆమడదూరంలో వుందని తేటతెల్లమవుతోంది.డయాఫ్రం వాల్‌ను నాణ్యంగా నిర్మించనందున వరదలకు దెబ్బతిన్నది. విదేశీ నిపుణులు సైతం దీన్ని నిర్ధారించారు కానీ వారిచ్చిన నివేదికను బహిరంగపర్చలేదు. మరమ్మతులకు అదనంగా రూ.900 కోట్లు ఇచ్చారేతప్ప డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమైన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిర్మాణంలో అవకతవకలను సరిచేయడానికి భవిష్యత్‌లో డ్యాం భద్రతకు అవసరమైన చర్యలను పారదర్శకంగా తీసుకోవాలి. కానీ డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కనిపెట్టలేక పోయారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరేడు సంవత్సరాలు ఆలస్యం అవుతోందని సిఎం చంద్రబాబు చెప్పారే తప్ప అందుకు కారణమైన కాంట్రాక్టర్, ఆనాటి పనులు సర్టిఫైచేసిన ఉన్నతాధి కారులు, గత ప్రభుత్వంలో ఈ అంశాల్లో నిర్ణయాలు చేసినవారిపై ఎలాంటి చర్యలనూ వెల్లడించలేదు. ఇప్పటికైనా ముందు నిర్వాసితులను ఆదుకోవాలి. దుబారా హెలికప్టర్ ఖర్చులు తగ్గించుకుని వారికి న్యాయం చేయాలి.

# స్లీపర్ బస్సు ప్రమాదాల నివారణకు చర్యలు

- గుర్తింపు పొందిన సంస్థలకే తయారీ పనులు
- ప్రమాదాలతో కేంద్రం నిర్ణయం
- బిల్లును సిద్ధం చేసిన అమెరికా





**న్యూఢిల్లీ, జనవరి 9:** స్లీపర్ బస్సు ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్థానికంగా పనిచేసే మాన్యువల్ స్లీపర్ బస్సు బాడీ బిల్డర్లకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆటోమొబైల్ కంపెనీలు, తయారీ సంస్థలకే బస్సుల తయారీకి అనుమతి ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రకటన జారీ చేసింది. గత ఏడాది దేశంలోని పలు రాష్ట్రాల్లో ఘోర బస్సు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. ప్రైవేటు స్లీపర్ బస్సులు ప్రమాదానికి గురవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించారు. ఏపీ, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బస్సు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని నివేదికల్లో తేలిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరిగినట్లు బయటపడిందన్నారు. అంతే కాకుండా అగ్నిప్రమాదం జరిగిన సమయాల్లో మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో లేకపోవడం కూడా ప్రమాదానికి కారణమైందని చెప్పారు. అలాగే బస్సుల్లో తరచూ తనిఖీలు చేపట్టకపోవడం కూడా మరో కారణమని నివేదికల్లో తేలిందని చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. బస్సు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థలు మాత్రమే బస్సులను తయారు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ఉన్న అన్ని స్లీపర్ బస్సుల్లో అగ్నిప్రమాద గుర్తింపు వ్యవస్థ, ప్రతి ఎమ్జ్గ÷న్సీ ఎగ్జిట్ వద్ద సుత్తి, అత్యవసర లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే బస్సులు, అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కార్లలో ఉచిత స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి వాహనం నుంచి వాహనానికి కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ÷ఎ2÷ఎ టెక్నాలజీ ద్వారా వాహనాలు తమ వేగం, స్థానం, దిశ వంటి కీలక సమాచారాన్ని సమీప వాహనాలతో పంచుకోగలవని ఆయన వివరించారు. టెక్నాలజీ వల్ల అకస్మాత్తుగా బ్రేక్ వేసినా.. రోడ్డుపై వాహనాలు ఆగి ఉన్నా.. మిగతా వాహనాలకు అలర్ట్ వెళ్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. తద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థను అన్ని వాహనాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సాంకేతికత రోడ్డు భద్రతను మరింత మెరుగుపరుస్తుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

- ఈడీ చర్యలపై మమతా నిరసన ప్రదర్శన
- మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బీజేపీ
- విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఈడీ పిటిషన్



**కోల్‌కతా, జనవరి 9:** ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ, దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్య మంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారం రోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా మమతా బెనర్జీ అధికార దుర్వి నియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

# కోల్‌కతాలో ఈడీ దాడులకు నిరసన

## హోంమంత్రి అమిత్ షా నివాసం ముందు టీఎంసీ ఆందోళన

**న్యూఢిల్లీ, జనవరి 9:** కోల్‌కతాలో ఈడీ దాడులను ఖండిస్తూ టీఎంసీ ఎంపీలు ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కార్యాలయం ముందు నిరసనలు చేపట్టారు. శుక్రవారం ఉదయం టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, శతాబ్ది రాయ్, మహువా మొయిత్రా, కీర్తి ఆజాద్‌తో పాటు మరికొంతమంది నిరసనలు చేపట్టారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేయటం మొదలెట్టారు. పోలీసులు రంగంలోకి దిగి వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అతి కష్టం మీద వారిని అక్కడి నుంచి పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌కు తరలించారు. రాజకీయ కన్‌స్టలెన్సీ సంస్థ ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంలో గురువారం ఈడీ సోదాలు నిర్వహించింది. కోల్‌కతాలోని ఆయన నివాసంలో ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఈడీ తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా మమతా మీడియాతో మాట్లాడుతూ.. 'మా ఐటీ సెల్ చీఫ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. మా పార్టీకి సంబంధించిన దస్త్రాలు, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మా పార్టీ అభ్యర్థుల వివరాలు వాటిలో ఉన్నాయి. వాటిని వెనక్కు తీసుకున్నారని అన్నారు. మా పార్టీకి సంబంధించిన డాక్యుమెంట్లను ఈడీ తీసుకోవచ్చా? నేను ఇలాగే బీజేపీ ఆఫీసుకు వెళితే పరిస్థితి ఏమిటి? ఓటర్ జాబితా సమగ్ర సవరణ పేరిట






ఇప్పటికే 5 లక్షల మంది పేర్లను తొలగించారు. కేవలం ఎన్నికలు జరగనున్నాయనే ఇలా చేస్తున్నారు'.. అంటూ మండిపడ్డారు. కాగా, కేంద్రం రాజకీయ లబ్ది కోసం ఈడీని అస్త్రంగా వాడుతోందని టీఎంసీ పార్టీ నేతలు అంటున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు.

# శబరిమల ప్రధాన పూజారి అరెస్టు

## శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం






**తిరువనంతపురం, జనవరి 9:** కేరళలోని శబరిమల ఆలయంలో బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆలయ ప్రధాన పూజారి కందరారు రాజీవరును సిట్ అధికారులు తాజాగా అరెస్టు చేశారు. పలు నివేదికల ప్రకారం.. బంగారు తాపడాల చోరీ కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా పలువురు సిట్ అధికారులు మాట్లాడుతూ.. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో సిట్ అధికారుల బృందం ఆయన్ను అదుపులోకి తీసుకుందని వివరించారు. విచారణ అనంతరం శబరిమల ఆలయ ప్రధాన పూజారి కందరారు రాజీవరును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నిజానికి శబరిమలకు ఉన్ని కృష్ణన్ పొట్టిని తీసుకువచ్చింది కూడా తంత్రి కందరారు రాజీవరేనని ఇతర నిందితులు తమ వాంగ్మూలంలో తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. బంగారు తాపడాల చోరీ గురించి ఆయనకు ఫస్ట్ నుంచే సమాచారం ఉందని తెలిపారు. ఈ చోరీపై ఈడీ కేసు ÷ల్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 2019లో కేరళలోని శబరిమల ఆలయం గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించారు. ఉన్ని కృష్ణన్ అనే దాత వాటిని సరిచేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని తీసుకెళ్లారు. ఆ టైంలో ఈ పనిని పూర్తి చేయడానికి చెన్నైలోని ఓ కంపెనీకి ఇచ్చారు. ఆ రాగ తాపడాలను తొలగించే టైంలో రికార్డుల్లో వాటి బరువును 42.100 కిలోలుగా పేర్కొన్నారు. అయితే ఎలక్ట్రోప్లేటింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత వాటిపై ఉండే బంగారంలో కొంత కనిపించకుండా పోయిందని ఆ కంపెనీ వెల్లడించింది. ఇందులో ఏదో తిరకాసు జరిగినట్లు అధికారులు గుర్తించి, విచారణ చేపట్టారు. ఈ కేసు విచారణలో ఉన్ని కృష్ణన్ సహా పలువురు ప్రధాన అధికారులు నిందితులుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# మన భూములపై రాజముద్ర

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు. రాజముద్ర వేసి పాస్‌బుక్‌లు ఇస్తామని హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేర్చామని తెలిపారు. గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు ఈనెల 11 వరకు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. ఒక్క రూపాయి అవినీతి లేకుండా చూడాలని అధికారులకు చెప్పా. ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, మిగతా సిబ్బంది మనసుపెట్టి పనిచేయాలి. వచ్చే నెలలో మళ్లీ సర్వే చేసి పాస్‌బుక్‌లు ఇస్తాం అన్నారు. ఒక్కసారి ప్రింట్ అయ్యాయంటే ఇక జీరో మిస్టేక్స్ ఉండాలి. భూమికి సంబంధించి 29 అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. అన్నింటినీ పరిష్కరిస్తున్నాం. 22-ఏ భూములపై వచ్చిన సమస్యలన్నీ తొలగిస్తున్నాం. రైతుల భూరికార్డులన్నీ బ్లాక్‌చైన్‌లో భద్రంగా ఉంటాయి. ఎవరైనా భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటాం. చిన్న చిన్న భూతగాదాలు పెట్టుకోవద్దని ప్రజలందరినీ కోరుతున్నా. కుటుంబసభ్యులు, బంధువులతో వివాదాలు వద్దు. గొడవలు పడి కోర్టులకు వెళ్తే జీవితమంతా ఖర్చుయిపోతుంద సీఎం చంద్రబాబు తెలిపారు. అయితే పాసు పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు తీసుకున్న రైతులంతా సభకు రాకపోవటంపై కలెక్టర్, రెవెన్యూశాఖ అధికారులపై




సీఎం మండిపడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో పారదర్శకత ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మీ భూమి మీద హక్కు' ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపీణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'మీ భూమి - మీ హక్కు'... చేసి చూపించామన్నారు. రైతులకు ఎప్పుడూ అన్యాయం జరగకూడదని అన్నారు. కరోనా సమయంలోనూ పనిచేసి రైతులు అందరికీ అన్నం పెట్టారని గుర్తుచేశారు. ఏపీలో 6,680 ఎకరాల్లో రీ సర్వే చేశామని.. 22.30 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధం చేశామని చెప్పారు. గతంలో పట్టాదారు పాసు పుస్తకాలకు జగన్ ఫొటో పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. ఈ పట్టాదారు పాసు పుస్తకాన్ని ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని తెలిపారు. ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే గుర్తించి శిక్షించే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## కోనసీమ గ్యాస్ లీక్‌పై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

మొదటి పేజీ తరువాయి

కోనసీమ జిల్లా, ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు కూడా మంటలు కొనసాగుతుండటంతో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. గ్యాస్ బావి నుంచి ఎగిసిపడుతున్న మంటలను, పరిసర ప్రాంతాల్లోని పరిస్థితిని ఆయన గగనతలం నుంచి పరిశీలించారు. అనంతరం మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ఆయన ఓఎన్జీసీ అధికారులు, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎంపీ హరీశ్ బాలయోగి, ఎమ్మెల్యే వరప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సీఎం ఆరా తీశారు. మంటల వల్ల దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బ్లోఅవుట్‌ను అదుపులోకి తెచ్చేందుకు ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ముమ్మరంగా పనిచేస్తున్నామని ఓఎన్జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షోభ నిర్వహణ బృందం (జమీ) ఇప్పటికే బావి పరిసరాల్లోని శిథిలాలను చాలావరకు తొలగించి, బావి హెడ్ వద్దకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసింది. బావిని క్యాపింగ్ చేసే దిశగా ఆపరేషన్ కొనసాగించేందుకు అడ్డంకిగా ఉన్న మాస్ట్, ఇతర పరికరాల భాగాలను తొలగించినట్లు పేర్కొంది. బావి హెడ్ సమీపంలో సురక్షితంగా పనిచేసేందుకు వీలుగా నిరంతరం నీటిని చల్లుతున్నామని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు. కాగా, సోమవారం మధ్యాహ్నం మరమ్మతు పనులు చేస్తుండగా ఈ బావి నుంచి అకస్మాత్తుగా ముడిచమురుతో కూడిన గ్యాస్ భారీగా ఎగిసిపడిన విషయం తెలిసిందే. దీంతో ఇరుసుమండ, పరిసర గ్రామాల్లో దట్టమైన పొగ, గ్యాస్ వ్యాపించి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

# సంజయ్‌నగర్ నుంచి కోట వరకు..
# చర్చంతా రిజర్వేషన్ల పైనే!




తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ క్షేత్రం రణరంగంగా మారింది. ఆదిలాబాద్‌లోని సంజయ్‌నగర్ గల్లీల నుంచి చారిత్రక కోట ప్రాంతం వరకు ఇప్పుడు ఎక్కడ చూసినా 'రిజర్వేషన్ల' చిక్కుముడిపైనే ఉత్కంఠ సాగుతోంది. ఈ నెల 12న విడుదల కానున్న తుది ఓటర్ల జాబితా అభ్యర్థుల జాతకాలను తేల్చనుంది. ముఖ్యంగా గత ఎన్నికల రిజర్వేషన్లను పక్కన పెట్టి, ఈసారి 'రొటేషన్' విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుండటంతో సిట్టింగ్ కౌన్సిలర్ల వెన్నులో వణుకు మొదలైంది. ఏ వార్డు ఎవరికి కేటాయిస్తారో తెలియక, ప్రచారానికి వెళ్లాలో లేదో అర్థం కాక ఆశావహులు తలలు పట్టుకుంటున్నారు. ఇది కేవలం ఎన్నికల ప్రక్రియ మాత్రమే కాదు, క్షేత్రస్థాయి నాయకుల రాజకీయ మనుగడను నిర్ణయించే చావోరేవో తేల్చుకోవాల్సిన కీలక ఘట్టం.

**ఆశావహుల్లో మొదలైన వణుకు :** పారదర్శకతకు పెద్దపీట మున్సిపల్ రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ రాజ్యాంగబద్ధమైన 73, 74వ సవరణలకు అనుగుణంగా అత్యంత పకడ్బందీగా జరగనుంది. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఎస్సీ, ఎస్టీ మరియు బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వార్డుల వారీగా జనాభా దామాషా పద్ధతిని అనుసరిస్తూనే, 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించడం ద్వారా సామాజిక సమతుల్యతను కాపాడనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం రొటేషన్ పద్ధతిని పాటిస్తే, గతంలో జనరల్ కేటగిరీలో ఉన్న స్థానాలు ఈసారి బీసీ లేదా మహిళా కోటాలోకి వెళ్లే అవకాశం ఉంది. ఈ సాంకేతిక మార్పులే రాజకీయ పార్టీల వ్యూహాలను తలకిందులు చేస్తున్నాయి, పాత రిజర్వేషన్లనే నమ్ముకున్న నేతలకు ఇప్పుడు దిక్కుతోచని స్థితి ఏర్పడింది.

**ఎమ్మెల్యేలకు సీఎం అల్టిమేటం :** అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 'గాంధీభవన్' వేదికగా వ్యూహరచన చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈసారి అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు; మున్సిపల్ గెలుపు బాధ్యతను నేరుగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు అప్పగించి వారి పనితీరుకు 'ర్యాంకులు' కేటాయించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీని మున్సిపల్ వార్డుల్లో నిలబెట్టుకోలేకపోతే భవిష్యత్తులో టికెట్లు, పదవులపై ఆశలు వదులుకోవాల్సిందేనని సీఎం తేల్చిచెప్పారు. 'గల్లీ ప్రచారం కాదు.. ఇంటింటి ప్రచారం' అనే నినాదంతో ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ 'ర్యాంకింగ్ సిస్టమ్' ఎమ్మెల్యేల్లో కొత్త టెన్షన్‌ను నింపింది, గెలుపు కోసం వారు సర్వశక్తులు ఒడ్డాల్సిన పరిస్థితి నెలకొంది.

**కేంద్రంపై కాంగ్రెస్ యుద్ధం:** ఉపాధి హామీ చట్టం మార్పుపై పోరు మున్సిపల్ ఎన్నికల వేళ కేంద్రం తీసుకొచ్చిన వీబీజీ రామ్ జీ చట్టం (ఉపాధి హామీ మార్పులు) కాంగ్రెస్ పార్టీకి కొత్త ఆయుధంగా మారింది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉనికిని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తోందని, ఇది కూలీల పొట్ట కొట్టే చర్య అని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ అంశంపై ఫిబ్రవరి 2 నుంచి తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర విపక్షాలను ఎండగట్టాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక సమస్యలతో పాటు జాతీయ స్థాయి అంశాలను ప్రచారంలోకి తీసుకురావడం ద్వారా ఓటర్లను ఆకర్షించాలని భావిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలు చేసే అసత్య ఆరోపణలను సాక్ష్యాధారాలతో సహా తిప్పికొట్టేందుకు సోనియా, రాహుల్ గాంధీలను సైతం బహిరంగ సభలకు ఆహ్వానించడం రాజకీయ వేడిని పెంచుతోంది.

**విపక్షాల వ్యూహ ప్రతివ్యూహాలు :** రసవత్తరంగా మారిన రాజకీయం మున్సిపల్ పోరులో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు సైతం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, రైతు రుణమాఫీ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్నాయి. ఏపీ అక్రమ నీటి ప్రాజెక్టుల విషయంలో రేవంత్ సర్కారు మౌనాన్ని బీఆర్ఎస్ అగ్రనేతలు ఆయుధంగా మలుచుకుంటున్నారు. గత అసెంబ్లీ ఫలితాలను తిరగరాయాలని బీజేపీ కమలనాథులు తహతహలాడుతున్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ తర్వాత రాజకీయ వాతావరణం పీక్ స్టేజ్‌కి చేరుకోనుంది. సామాజిక మాధ్యమాల వేదికగా సాగుతున్న అసత్య ప్రచారాలను అడ్డుకుంటూనే, ఓటర్ల నాడిని పట్టేందుకు ప్రధాన పార్టీలన్నీ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. గెలుపు ఎవరిని వరిస్తుందో తెలియని ఉత్కంఠ ప్రతి వార్డులోనూ కనిపిస్తోంది.

పట్టణ అభివృద్ధికి దిక్సూచి మున్సిపల్ ఎన్నికలు కేవలం పదవుల పంపకం కాదు, ఇది పట్టణాల భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రక్రియ. రిజర్వేషన్ల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, చట్టబద్ధంగా అర్హులైన వారికి అవకాశం కల్పించినప్పుడే ప్రజాస్వామ్యానికి సార్థకత లభిస్తుంది. ఎమ్మెల్యేల ర్యాంకులు, పార్టీ పదవుల కంటే స్థానిక సమస్యల పరిష్కారమే పరమావధిగా అభ్యర్థులు పనిచేయాలి. అభివృద్ధి పథకాలు, సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయి పేదలకు అందుతున్నాయా లేదా అనేదే ఎన్నికల అసలు ఎజెండా కావాలి. ఓటర్లు సైతం ప్రలోభాలకు లోనుకాకుండా, వార్డు అభివృద్ధిని కాంక్షించే నాయకులకే పట్టం కట్టాలి. తెలంగాణ రాజకీయాల్లో పెనుమార్పులకు సంకేతంగా నిలిచే ఈ పురపోరులో అంతిమంగా ప్రజాస్వామ్యమే గెలవాలి. ఎందుకంటే, ప్రజల తీర్పే శిరోధార్యం.


ఫిరోజ్ ఖాన్
సీనియర్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464




## ఆదర్శ మూర్తి: ఫజుల్ రెహమాన్ గారికి
# కన్నీటి వీడ్కోలు!

ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ 9640466464



తెలుగు జర్నలిజం ప్రపంచంలో ఒక ధ్రువతార నేలకొరిగింది. తన కలంతో వేలాది మందిని చైతన్య పరిచిన అక్షర యోధుడు, నిబద్ధతకు నిలువుటద్దం శ్రీ మహమ్మద్ ఫజుల్ రెహమాన్ సర్ ఇక లేరన్న వార్త పత్రికా రంగాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధితో పోరాడుతూ కూడా, చివరి క్షణం వరకు తనలోని ఆత్మవిశ్వాసాన్ని కోల్పోని ఆ మహా మనిషి నిష్క్రమణ జర్నలిజానికి తీరని లోటు. నేటి వాణిజ్య జర్నలిజం యుగంలో విలువలతో కూడిన పాత్రికేయాన్ని బతికించిన అతికొద్ది మందిలో ఫజుల్ రెహమాన్ ఒకరు. ఆంధ్రజ్యోతి, సాక్షి వంటి ప్రధాన పత్రికలలో ఆయన పనిచేసిన కాలం ఒక స్వర్ణయుగం. వార్త అంటే కేవలం సమాచారం కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని ఆయన నమ్మారు. అక్షరాన్ని అమ్ముకోని తత్వం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం ఆయనను ఒక సామాన్య జర్నలిస్టు నుంచి ఒక గొప్ప 'కామ్రేడ్'గా నిలబెట్టాయి.

జన్మభూమిపై మమకారం ఆయన నరనరాల్లో ప్రవహించేది. హుస్నాబాద్ వాసిగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందినా, తన ఊరి చరిత్రను, సంస్కృతిని నేటి తరానికి అందించడంలో ఆయన నిరంతరం తపించారు. హుస్నాబాద్ గతం గురించి ఆయన చెప్పే కథనాలు, రాసే వ్యాసాలు ఆ ప్రాంత యువతకు తమ వారసత్వంపై గర్వం కలిగించేవి. పుట్టిన గడ్డకు తను చేసే అతిపెద్ద సేవ 'జ్ఞానాన్ని పంచడమే' అని ఆయన నిరూపించారు. ఆయనతో కలిసి పనిచేసిన వారికి ఆయన కేవలం ఒక సహచరుడు మాత్రమే కాదు, ఒక మార్గదర్శి. క్లిష్ట సమయాల్లో జూనియర్ల భుజం తట్టి 'నేనున్నాను' అని ధైర్యం చెప్పే గొప్ప సంస్కారం ఆయనది. వృత్తిపరమైన మెలకువలతో పాటు జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పిన గురువు ఆయన. ఆయన మాటల్లో ఉండే నిశితమైన పరిశీలన, వ్యక్తిత్వంలో ఉండే నిరాడంబరత ఆయనతో పనిచేసిన ప్రతి ఒక్కరి గుండెల్లో చెరగని ముద్ర వేశాయి.

### మహమ్మారిపై పోరాటం.. స్ఫూర్తిదాయక ప్రయాణం

క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధి శరీరానికి సోకినా, ఆయన మనోధైర్యాన్ని మాత్రం దెబ్బతీయలేకపోయింది. అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో కూడా పత్రికా రంగంపై ఆయనకున్న మక్కువ తగ్గలేదు. మృత్యువు కళ్ళముందు కనిపిస్తున్నా చిరునవ్వుతో ఎదుర్కోవడం ఆయనకే చెల్లింది. పోరాటం అంటే కేవలం యుద్ధభూమిలోనే కాదు, జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలులోనూ ఉంటుందని ఆయన తన చివరి రోజుల్లోనూ చాటిచెప్పారు.

### అక్షరం ఉన్నంత వరకు.. మీరు ఉంటారు



ఫజుల్ రెహమాన్ గారు భౌతికంగా మన మధ్య లేకపోవచ్చు, కానీ ఆయన సిరా చిందించిన ప్రతి అక్షరం ఒక చైతన్య దీపమై వెలుగుతూనే ఉంటుంది. జర్నలిజం రంగంలోకి వచ్చే ప్రతి కొత్త తరం విలేకరికి ఆయన జీవితం ఒక పాఠ్యాంశం. నిజాయితీ, నిబద్ధత, సామాజిక స్పృహ అనే మూడు స్తంభాలపై ఆయన నిర్మించుకున్న ఈ పత్రికా సామ్రాజ్యం ఎందరికో స్ఫూర్తిదాయకం. హుస్నాబాద్ మట్టిలో కలిసిపోతున్న ఆ మహా మనిషికి అక్షర నివాళులు. మీరు లేని లోటు జర్నలిజం లోకానికి ఎన్నటికీ పూడ్చలేనిది. మీ ఆశయాలను, మీరు నేర్పిన విలువలను గుండెల్లో భద్రపరుచుకుని ముందుకు సాగడమే మేము మీకు ఇచ్చే అసలైన నివాళి.

అమర్ రహే ఫజుల్ రెహమాన్ సర్! జోహార్లు కామ్రేడ్!

## సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

### విశాఖ సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యనాయుడు



**విశాఖపట్నం :** భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని.. భారతీయ వంటలు అందరూ తినాలని దేశ ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మన పండగల విశిష్టతను చాటాలన్నారు. సంక్రాంతి పండగ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. విశాఖపట్నంపై తనకు ఎంతో ప్రేమ ఉందని చెప్పారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తాను ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. తెలుగు రైతుల పండగ సంక్రాంతి.. తెలుగు వారి లోగిళ్లలో ఇది పెద్ద పండగని వెంకయ్యనాయుడు అభివర్ణించారు. ఫల సాయాన్ని అందించే వ్యవసాయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదని ప్రజలకు ఆయన హితవు పలికారు. అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను, మాతృభాషను మర్చిపోకూడదని చెప్పారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో పరిపాలన చేయాలంటూ ప్రభుత్వాలకు ఆయన సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలంటూ ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక సూచన చేశారు.విద్యార్థి దశలో ఎన్నో పోరాటాలు చేశానని.. జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆమె కారణంగానే తాను రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. స్వతంత్ర భారతదేశంలో ఆత్మ నిర్భర భారత్ కోసం అందరూ కృషి చేయాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ప్రపంచంలో నాలుగో వంతు జీడీపీ భారతదేశానిదేనని పేర్కొన్నారు. పశు సంపద ఎంత బాగుంటే జాతీయ సంపద కూడా అంత బాగుంటుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ముందు.. ఎవరు ఎన్ని సుంకాలు వేసినా ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. అందుకే ఆత్మ నిర్భర భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ అంటున్నారని వివరించారు. తాను రైతు బిడ్డగా పుట్టానని.. అందుకే రైతులు అంటే తనకు చాలా అభిమానమన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి జనవరి9( సమయం న్యూస్). :** దోమకొండ మండలం సీతారాంపల్లి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జిల్లా కలెక్టర్‌ను బొకే అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యాలయంలో అన్ని మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు సరిగా ఉన్నాయా, భోజనం నాణ్యత ఎలా ఉందని, టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయా, వాటిలో రన్నింగ్ వాటర్ వస్తున్నదా, త్రాగునీటి సమస్య ఏమైనా ఉందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటి కేజీబీవీ ఆవరణలో నిర్మిస్తున్న పెండింగ్‌లో ఉన్న సంపు నిర్మాణ పనులను పరిశీలించి ఆరా తీశారు. సంపు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం స్టోరేజ్ ని పరిశీలించి సరకుల నిల్వలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రిజిస్టర్ లను పరిశీలించి రిజిస్టర్ లో ఉన్న నిల్వలను స్టోరేజీలో ఉన్న నిల్వల వివరాలను ఆరా తీసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఈ సందర్శనలో ప్రిన్సిపల్ మంగమ్మ , ఎతీశీ విజయ్ కుమార్, ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ భానుశ్రీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా రంగంలో నిజామాబాద్ ఖ్యాతిని ఇనుమడింపజేయాలి


- కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు
- అర్బన్ ఎమ్మెల్యేతో కలిసి సీఎం కప్ టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్




**నిజామాబాద్ జనవరి 09(సమయం న్యూస్) :** క్రీడా రంగంలో నిజామాబాద్ జిల్లా ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేయాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీ.ఎం కప్-2026 సెకండ్ ఎడిషన్ క్రీడా పోటీలను పురస్కరించుకుని శుక్రవారం నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణతో కలిసి జెండా ఊపి టార్చ్ రిలే ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. పాలిటెక్నిక్ మైదానం నుండి ప్రారంభమైన టార్చ్ రిలే ర్యాలీ, ప్రధాన మార్గాల మీదుగా పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా నుండి నిఖత్ జరీన్, యెండల సౌందర్య, గూగు లోత్ సౌమ్య, హుస్సాముద్దీన్ వంటి అనేక మంది అంతర్జాతీయ స్థాయి క్రీడా కారులు ప్రాతినిధ్యం వహిస్తుండడం ఎంతో గొప్ప విషయం అన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థిని, విద్యార్థులు, గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. క్రీడల్లో ధనిక, పేద అనే తారతమ్యం ఉండదని, ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రతిభనే కొలమానం అని క్రీడాకారులకు మార్గనిర్దేశం చేశారు. అతి సామాన్య కుటుంబం నుండి వచ్చిన క్రికెటర్ మహ్మద్ సిరాజ్ జీవితమే ఇందుకు చక్కటి నిదర్శనమని కలెక్టర్ ఉదహరించారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిస్తే బంగారు భవిష్యత్తు సొంతం అవుతుందన్నారు. సీ.ఎం కప్ క్రీడా పోటీలలో అన్ని అంశాలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చి, నిజామాబాద్ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. తాను కూడా స్విమ్మింగ్ క్రీడాకారిణి అని, ఫ్రీ స్టైల్, రిలే, బట్టర్ ఫ్లై తదితర విభాగాలలో అనేక పోటీలలో పాల్గొన్నానని కలెక్టర్ క్రీడల పట్ల తనకు గల ఆసక్తి గురించి తెలియజేశారు. చక్కటి దేహదారుఢ్యానికి, ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని గుర్తు చేశారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెదడు చురుకుగా మారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపగలుగుతారని, అన్ని రంగాలలో చక్కగా పని చేయవచ్చని సూచించారు. క్రీడల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో తోడ్పాటును అందిస్తామని అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, దురలవాట్ల బారిన పడకుండా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఇందుకు క్రీడలను వేదికగా మల్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్ లు, క్రీడాకారులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అందరికీ అందుబాటులో యూరియా

- యాసంగి అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి
- రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు...మండల స్థాయి అధికారులు



**నెల్లుకుదురు జనవరి 09( సమయం న్యూస్).:** గౌరవ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ గారి ఆదేశానుసారం శుక్రవారం నెల్లికుదురు మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న, మరియు తహశీల్దార్ సి. హెచ్. నరేష్, మండలంలో యూరియా పంపిణిని పరిశీలించారు. ప్రస్తుత యాసంగి (రబీ) సీజన్ లో పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపినారు. పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా వారి అవసరాలకు సరిపడా యూరియాను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అయితే ఒకేసారి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో అవసరానికి సరిపడా మాత్రమే వినియోగించాలని రైతులను కోరారు.

# క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత

- క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం
- సీఎం కప్-2025 టార్చ్ ర్యాలీ ప్రారంభం



**కరీంనగర్ జనవరి9( సమయం న్యూస్). :** క్రీడా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాణించాలని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అన్నారు. చీఫ్ మినిస్టర్ కప్- 2025 టార్చ్ ర్యాలీ కరీంనగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం నుండి ప్రారంభమైంది. ఈ ర్యాలీని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ప్రారంభించారు. తెలంగాణ చౌక్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గతంలో క్రీడాకారులకు రాష్ట్రంలో ఎలాంటి అవకాశాలు ఉండేవి కావని అన్నారు. ఈ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నదని, క్రీడాకారులకు అవకాశాలు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నదని తెలిపారు. ఫుట్బాల్ దిగ్గజం మిస్సితో ఫుట్బాల్ ఆడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల్లో, క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారని తెలిపారు. రాష్ట్రం నుండి అనేక మంది క్రీడాకారులు ఒలంపిక్స్ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. క్రీడా రంగానికి నిధులు వెచ్చిస్తూ క్రీడా సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. క్రీడా రంగానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో రాణించాలని అన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కరీంనగర్ క్రీడాకారులు ఎన్నో మెడల్స్ సాధించారని తెలిపారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్తేజం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, ఆర్డిఓ మహేశ్వర్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, జిల్లా యువజన అధికారి రాంబాబు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్, సిద్ధారెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

# వైకుంఠ ద్వార దర్శనాలపై భక్తుల్లో విశేష సంతృప్తి

- 10 రోజుల్లో 7.83 లక్షల మందికి శ్రీవారి దర్శనాలు
- గత వైకుంఠ ద్వార దర్శనాలతో పోల్చితే ఈసారి లక్ష మంది భక్తులకు అధికంగా దర్శనం
- రూ.41.14 కోట్ల హుండీ ఆదాయం
- 33 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ
- 44 లక్షల లడ్డూల విక్రయం



**తిరుమల, 2026 జనవరి 09 :** డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించిన వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ చేసిన ఏర్పాట్లపై భక్తులు విశేష సంతృప్తి వ్యక్తం చేసినట్లు టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతం కావడంతో ఆయన టీటీడీ ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శుక్రవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు.

సమావేశంలోని ముఖ్యాంశాలుః- స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరూ కూడా టీటీడీ కల్పించిన సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. - ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏఐ సహకారంతో ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా టోకెన్ లేని భక్తులకు కూడా వేగవంతంగా దర్శనం.

- వైకుంఠ ద్వార దర్శనాలపై దాదాపు 93 శాతం మంది భక్తులు సంతృప్తి.

శ్రీవారి ఆలయం...- ఈ పది రోజుల్లో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు.

- గత వైకుంఠ ద్వార దర్శనాల్లో 6.83 లక్షల మంది దర్శించుకోగా ఈ ఏడాది లక్ష మంది భక్తులకు అదనంగా దర్శనాలు.
- జనవరి 2వ తేది శుక్రవారం రోజు అయినప్పటికీ రికార్డుస్థాయిలో 83 వేల మంది భక్తులకు దర్శనం.
- జనవరి 3వ తేది శనివారం అత్యధికంగా దాదాపు 89 వేల మందికి దర్శనం.
- అందుబాటులో ఉన్న 182 గంటల దర్శన సమయంలో 164 గంటల సమయం సామాన్య భక్తులకు కేటాయించడంతో సామాన్య భక్తుల్లో ఆనందం.
- ఈ పది రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు.
- భక్తులకు విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య - 44 లక్షలు
- గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 10 లక్షల లడ్డూలు అదనంగా విక్రయం.

భద్రత : - దాదాపు 2400 మంది పోలీసులు, 1150 మంది విజిలెన్స్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు.

- వివిధ విభాగాల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు.

ఇంజినీరింగ్ : - తిరుమల, తిరుపతిలో 5 భాషల్లో భక్తులకు అర్థమయ్యేలా 400 ప్రచార బోర్డులు ఏర్పాటు.

- రేడియో బ్రాడ్ కాస్టింగ్ ద్వారా 5 భాషల్లో వైకుంఠ ద్వార దర్శనాలపై అవగాహన.
- తిరుమలలో విద్యుత్ దీపాలంకరణపై భక్తులు విశేష ప్రశంస.
- తిరుమలలో టీటీడీ విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు.
- తిరుమలలో నీటి కొరత లేకుండా నిరంతరాయం భక్తులకు నీటి సరఫరా.

అన్న ప్రసాదం :- ఈ పది రోజుల్లో 33 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ.

- గత వైకుంఠ ద్వార దర్శనాలతో పోల్చితే ఈసారి 9.29 లక్షల మంది భక్తులకు అదనంగా అన్న ప్రసాదాలు పంపిణీ.
- తిరుమలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా క్యూలైన్లలో నిరంతరాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ.
- గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది దాదాపు 39 శాతం అధికంగా అన్న ప్రసాదాలు పంపిణీ.
- తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడికి వేడి బాదం పాలు సరఫరా.
- దాదాపు 1000 మంది అన్న ప్రసాదం సిబ్బందితో విజయవంతంగా ఎప్పటికప్పుడు అన్న ప్రసాదాలు తయారు చేసి పంపిణీ చేయడంతో భక్తులల్లో సంతృప్తి.

రిసెప్షన్

-ఫ్రాజ-1, 2, 3, 4, 5 లో గతంలో ఎన్నడూ లేని విధంగా చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి.

- నూతనంగా నిర్మించిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఫ్రాజ-5 భవనం అందుబాటులోకి రావడంతో భక్తులకు విరివిగా వసతి సదుపాయం.
- సామాన్య భక్తులకు అత్యధిక సంఖ్యలో వసతి గదులు అందుబాటులో ఉంచడంతో సౌకర్యవంతంగా గదులు పొందిన భక్తులు.
- తొలి మూడు రోజులు టోకెన్ కలిగిన భక్తులకే దర్శనం కల్పించడం ఎలాంటి అసౌకర్యం లేకుండా గదులు పొందిన భక్తులు

ఉద్యానవనం : - ఉద్యనవనం విభాగం ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీరంగనాధ స్వామి ఆలయ సెట్టింగ్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

- శ్రీవారి ఆలయంలో 10 రోజుల పాటు 50 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలు, 4 టన్నుల కట్ ఫ్లవర్స్ తో ఏర్పాటు చేసిన అలంకరణలు వైకుంఠాన్ని తలపించాయని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

కల్యాణకట్ట:- ఈ పది రోజుల్లో 2.06 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పణ.

- తలనీలాల సమర్పణకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సౌకర్యవంతం ఏర్పాట్లు.
- గతంలో కంటే ప్రస్తుతం తలనీలాల సమర్పణ సులువుగా సౌకర్యవంతంగా ఉందని చాలా మంది భక్తులు తెలియజేశారు.

- ఆరోగ్య విభాగం...- దర్శన క్యూ లైన్లు, రోడ్లు, మరుగుదొడ్ల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిశుభ్రతకు పెద్దపీట.

- దర్శన క్యూలైన్లు, రద్దీ ప్రాంతాల్లో భక్తులకు మొబైల్ వాటర్ డ్రమ్స్ తో తాగు నీరు పంపిణీ.

వైద్య విభాగం..- 24 గంటలు దర్శన క్యూ లైన్లు, నారాయణగిరి షెడ్లలో అందుబాటులో ఉంచిన మొబైల్ డిస్పెన్సరీల ద్వారా అవసరమైన భక్తులకు వైద్యం.

శ్రీవారి సేవకులు...- వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా దాదాపు 4వేల మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు.

- ముఖ్యంగా అన్న ప్రసాద విభాగంలో 1900 మంది, ఆరోగ్య విభాగంలో 625 మంది, విజిలెన్స్ విభాగంలో 400 మంది సేవకుల సేవలు.
- 150 మంది గ్రూప్ సూపర్వైజర్లు 24 గంటలు భక్తులు రద్దీని పర్యవేక్షిస్తూ అద్భుతమైన సేవలు అందించారు.

ఈ సందర్భంగా టీటీడీ యంత్రాంగం తో సమన్వయం చేసుకుని చక్కటి సేవలు అందించిన పోలీస్ యంత్రాంగం, జిల్లా యంత్రాంగం, ఏపీఎస్ ఆర్టీసీ, శ్రీవారి సేవకులు, ఇతర విభాగాలు, మీడియా ప్రతినిధులకు చైర్మన్ ధన్యవాదాలు తెలియజేశారు. టీటీడీ ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా గతంలో కంటే అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారని చెప్పారు. గత వైకుంఠ ఏకాదశి రోజు 7 లక్షలకు పైగా దర్శించుకుంటే ఈసారి 12 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. టీటీడీ భక్తుల కోసం చేస్తున్న సౌకర్యాలను చూసి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారని చెప్పారు. అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి మాట్లాడుతూ వివిధ విభాగాల మధ్య సమన్వయంతో సమయాన్ని సరైన విధంగా వినియోగించుకోవడంతో అనుకున్న దానికన్నా అదనంగా దర్శన సమయం సమకూరడంతో మరింత మంది భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం చేయించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ నరేష్, శ్రీ శాంతారామ్, జిల్లా కలెక్టర్ శ్రీ వెంకటేశ్వర్, ఎస్పీ శ్రీ సుబ్బరాయుడు, సీవీఎస్వో శ్రీ మురళీ కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నార

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్,
- జిల్లా పోలీస్ శాఖకు ఋూ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత సైన్‌బోర్డుల వితరణ
- విద్యార్థుల భద్రతే లక్ష్యంగా రోడ్డు భద్రత చర్యలు
- వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.




**నారాయణపేట, జనవరి,09(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రోడ్డు భద్రతకు సంబంధించిన సూచిక బోర్డులను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్, ఆర్ టి ఎ మెంబర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డి టి ఓ (ఋూ) అధికారి మెగా గాంధీ, ఆర్ టి ఎ మెంబర్ పోషల్ రాజేష్ కలిసి రోడ్డు భద్రత నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా స్కూల్ జోన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయుటకు "గో స్లో", సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదు, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, రాంగ్ రూట్లో వాహనాలు నడపరాదు అనే స్లోగన్లతో రూపొందించిన మొత్తం 18 రోడ్డు భద్రత సూచికల బోర్డులను జిల్లా పోలీస్ శాఖకు వితరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.... జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల సమీప ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు నెమ్మదిగా తమ వాహనాలను నడపాలని సూచించారు. ఈ విలువైన సూచిక బోర్డులను అందించిన ఆర్టీఏ (=ఋూ )మెంబర్ పోషల్ రాజేష్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు. మొదటగా జిల్లా కేంద్రంలో ఈ సైన్‌బోర్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమని, తదుపరి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రధాన రహదారుల వద్ద ఈ సూచిక బోర్డులను ఏర్పాటు చేసి వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. నేటి బాలలే భావి భారత పౌరులని, అలాంటి విద్యార్థుల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు మరియు రవాణా శాఖ సమన్వయంతో ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అలాగే రోడ్డు నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా రోడ్డు భద్రత మసోత్సవాల సందర్భంగా జిల్లా పరిధిలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హాక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్,ఆర్ఐ లు నరసింహ, విజయ్ భాస్కర్, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# సబర్మతి రివర్‌ఫ్రంట్ నమూనాను అధ్యయనం చేసిన జీహెచ్‌ఎంసీ బృందం

**-- మూసీ నది పునరుజ్జీవనంకు స్ఫూర్తిగా సబర్మతి రివర్‌ఫ్రంట్ నమూనా**

**అహ్మదాబాద్/ హైదరాబాద్ జనవరి09( సమయం న్యూస్).** నగర నదీ పరివాహక తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధికి ఉత్తమ విధానాలు, నమూనాలను అవగాహన చేసుకునే ఉద్దేశంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కార్పొరేటర్ల బృందం స్టడీ టూర్ లో భాగంగాగు జఅబరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని సబర్మతి రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును శుక్ర,శనివారాల్లో సందర్శించింది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మనేతృత్వంలో మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి , కార్పొరేటర్ల బృందం గురువారం, శుక్రవారం పర్యటించింది. ఈ సందర్భంగా అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఏఎంసీ) ప్రజాపతి విజయ్, సబర్మతి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్ఆర్ఎఫ్‌డీసీఎల్) ప్రతినిధులు ప్రాజెక్టు రూపకల్పన, ప్రణాళిక, అమలు విధానాలను జీహెచ్‌ఎంసీ బృందానికి వివరించారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన సబర్మతి నది పరివాహక తీరాన్ని ప్రజలకు అనుకూలమైన పర్యాటక, వినోద ప్రాంతాలుగా మార్చిన విధానాన్ని వారు వివరించారు. సబర్మతి రివర్ ఫ్రంట్ ను 7 దశల్లో అభివృద్ధి చేయనుండగా, మొదటి దశ 11.5 కిలో మీటర్ల మేర అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయన్నారు. రెండో దశ మరో 6 నెలల్లో పూర్తి కానుందన్నారు. సబర్మతి రివర్ ఫ్రంట్ ను అభివృద్ధి చేయాలని సంకల్పించిన వెంటనే ఓ ఆర్గనైజేషన్ ప్రత్యేకంగా దీనికోసం ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. వాస్తవ నివసితులతో నేరుగా చర్చించామనీ చెప్పారు. పొలిటికల్ ఇన్వాల్వ్మెంట్ లేకుండా చూశామని తెలిపారు. పునరావాసం, ఇతర ప్రయోజనాలు నేరుగా నిర్వాసితులకు అందించామని తెలిపారు. నది ఇరువైపులా మేర విస్తరించిన ఈ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు వరద నియంత్రణ, పర్యావరణ పునరుద్ధరణ, పట్టణ పునరుజ్జీవనాన్ని సమన్వయం చేస్తూ, వాకింగ్ ట్రాక్ లు, పార్కులు, తోటలు, వినోద సౌకర్యాలను కల్పిస్తోంది. థీమ్ పార్కులు, తూర్పు--పడమర తీరాలను కలుపుతున్న అద్భుతమైన అటల్ ఫుట్ బ్రిడ్జిను బృందం సందర్శించింది. సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ జీహెచ్‌ఎంసీ బృందాన్ని ఆకర్షించింది. ఈ అధ్యయన పర్యటన హైదరాబాద్‌లో మూసి నదీ తీరాభివృద్ధి, పబ్లిక్ స్థలాల నిర్వహణ, పౌర కేంద్రిత నగర అభివృద్ధికి మార్గనిర్దేశకంగా నిలుస్తుందని జీహెచ్‌ఎంసీ బృందం అభిప్రాయపడింది.¯ ప్రాజెక్ట్ క్షత సందర్శన సహా స్టడీ టూర్ లో గుర్తించిన బెస్ట్ ప్రాక్టీసెస్ కు సంబంధించిన సమగ్ర నివేదికను బృందం జీహెచ్‌ఎంసీ, ప్రభుత్వానికి సమర్పించనుంది.



# కోటవంచ నరసింహా స్వామి దేవాలయాభివృద్ధి పనులు పూర్తి చేయండి

- భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ.



**భూపాల పల్లి జనవరి09( సమయం న్యూస్). :** ఈ నెలాఖరు నాటికి కొడవటం శ్రీ లక్ష్మనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రెవెన్యూ, దేవాదాయ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు శాఖల అధికారులతో దేవాలయ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 12వ తేదీలోగా అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే ఇప్పటికే చేపట్టిన పనులకు సంబంధించిన ఎంబి రికార్డును ఈ నెల 19వ తేదీలోగా పూర్తి చేయాలని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సమీక్షకు ముందు దేవాలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించి, పనుల నాణ్యత, వేగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే నెలలో దేవాలయానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం ఉందని, ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి ఈఈకి సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టిన అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు పనుల కొరకు ప్రతి పాదనలు, పూర్తి అయిన పనులకు ఎంబి రికార్డులను అందచేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హూర్ నాయక్, పిర్ ఎస్ఈ చక్రవర్తి, దేవాదాయశాఖ ఈఈ దుర్గ ప్రసాద్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ శ్వేత, ఆర్అండ్‌బి ఈఈ రమేష్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఎఫ్డిఓ అప్పలకొండ, తహసీల్దార్ శ్వేతా, దేవస్థానం ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


# ఎస్ సి సబ్ ప్లాన్ ద్వారా పశువులకు మేత పంపిణీ.



**జడ్చర్ల జనవరి09( సమయం న్యూస్).:** షెడ్యూల్డ్ కుల ఉప ప్రణాళిక (ాజుూ) కింద, "మెరుగైన మేత భద్రత కోసం మెరుగైన మొక్కజొన్న సైలేజ్ పద్ధతులను వ్యాప్తి చేయడం" అనే శిక్షణ-కమ్-ఇన్‌పుట్ పంపిణీ కార్యక్రమాన్ని 09 జనవరి 2025న హైదరాబాద్‌లోని రాజేందర్ నగర్‌లోని వింటర్ నర్సరీ సెంటర్, ×జూ=-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైజ్ రీసెర్చ్ (××వీ=) శాస్త్రవేత్తలు జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామంలోని రైతు వేదికలో విజయవంతంగా నిర్వహించింది. స్థిరమైన మేత లభ్యత మరియు మెరుగైన పశువుల ఉత్పాదకతను నిర్ధారించడానికి మెరుగైన మొక్కజొన్న ఉత్పత్తి పద్ధతులు మరియు సైలేజ్ తయారీ పద్ధతులపై వారి జ్ఞానాన్ని పెంచే లక్ష్యంతో 100 మంది షెడ్యూల్డ్ కుల రైతుల ప్రయోజనం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ాజుూ చొరవలో భాగంగా, పాల్గొనే రైతులకు వ్యవసాయ ఇన్‌పుట్‌లను పంపిణీ చేశారు. 100 మంది రైతులలో ప్రతి ఒక్కరికి బ్యాటరీతో పనిచేసే స్ప్రేయర్, ఒక టార్పాలిన్ మరియు ఒక పార లభించింది. అదనంగా, వ్యవసాయ యాంత్రీకరణ మరియు సామూహిక వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, ఫ్రూకి ఒక మాన్యువల్ సీడర్ చొప్పున 10 మాన్యువల్ సీడర్‌లను రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ICAR--IIM= డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్. జాట్ విచ్చేశారు. షెడ్యూల్డ్ కులాల రైతులకు కేంద్రీకృత సామర్థ్య నిర్మాణం మరియు సకాలంలో ఇన్‌పుట్ మద్దతు ద్వారా సాధికారత కల్పించడంలో ాజుూ పథకం యొక్క ప్రాముఖ్యతను ఆయన హైలైట్ చేశారు. పశుగ్రాస భద్రతను బలోపేతం చేయడంలో మరియు రైతుల ఆదాయాన్ని పెంచడంలో మొక్కజొన్న మరియు మొక్కజొన్న సైలేజ్ యొక్క కీలక పాత్రను ఆయన నొక్కిచెప్పారు మరియు లబ్ధిదారులకు వ్యవసాయ ఇన్‌పుట్‌లను కూడా పంపిణీ చేశారు. బహుముఖ పంటగా మొక్కజొన్న యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన IIM= వింటర్ నర్సరీ సెంటర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ సునీల్ నీలం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు మరియు సమన్వయం చేశారు. పశువులకు, ముఖ్యంగా చిన్న మరియు సన్నకారు రైతులకు, ఏడాది పొడవునా పశుగ్రాస అవసరాలను తీర్చడంలో సైలేజ్ టెక్నాలజీ యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ాజుూ కార్యక్రమం కింద సమగ్ర వ్యవసాయ అభివృద్ధి మరియు స్థిరమైన జీవనోపాధి మెరుగుదలకు ICAR--IIM= యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తూ, శాస్త్రవేత్తలు మరియు రైతుల మధ్య చురుకైన పరస్పర చర్యతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ ఎల్ జాట్, భూపేందర్ కుమార్,ICAR,IIMR \Örయాన, డాక్టర్ ఐ. భద్రు వీ=ఖ,ాజీూఖ , జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశ్, మండల వ్యవాయాధికారి బి. గోపీనాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు శేఖర్, నర్సింలు,శారద,సంతోష, నాగేశ్వరీ,భవాని, ఏలీయా, శంకర్ మరియు గ్రామ సర్పంచ్ బండ గిరి ప్రసాద్, డిప్యూటీ సర్పంచ్ రవి కిరణ్,గ్రామ రైతులు జనార్ధన్ రెడ్డి, కె శ్రీనివాస్ యాదవ్ , పెంటయ్య, కె మల్లికార్జున్, అశోక్,ఇతర రైతులు పాల్గొనడం జరిగింది

# "సంక్రాంతి సెలవుల్లో ఇళ్ల భద్రతపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్




**వికారాబాద్, జనవరి,09,(సమయం న్యూస్) :** రాబోయే సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా జిల్లా ప్రజలు తమ స్వగ్రామాలకు, ఇతర పట్టణాలు మరియు దూర ప్రాంతాలకు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో, ఇళ్లకు తాళం వేసి వెళ్లే సందర్భాల్లో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగలను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా నిరంతర పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ముఖ్యంగా నివాస ప్రాంతాలు, అపార్ట్‌మెంట్లు, గ్రామాలు, పట్టణాల్లో గస్తీ పెంచి, రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రయాణానికి వెళ్లే ముందు తమ ఇళ్లకు సురక్షతంగా తాళాలు వేసుకోవాలని, విలువైన వస్తువులు, నగదు, బంగారం ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచాలని సూచించారు. అలాగే పొరుగువారికి లేదా సమీప బంధువులకు సమాచారం ఇవ్వడం, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయడం ద్వారా అదనపు భద్రత పొందవచ్చని తెలిపారు. దొంగతనాలను నివారించడానికి పోలీస్ అధికారుల నియమ , నిబందనలు ఖచ్చితంగా పాటించాలని ఎస్పీ తెలియజేయడం జరిగింది. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే శాంతియుతంగా, సురక్షతంగా పండుగలను జరుపుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు.

# హుస్సేన్ పూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ముగ్గుల పోటీలు

- ముఖ్య అతిథి గా హాజరైన సర్పంచి దొడ్డ అంజిలప్ప
- పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతి కుమార్



**కొడంగల్ మండలం, జనవరి,09(సమయం న్యూస్) :** మండలంలోని ప్రాథమిక పాఠశాల, హుస్సేన్ పూర్ లో శుక్రవారం ముగ్గుల పోటీ నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథి గా పాల్గొన్న సర్పంచ్ దొడ్ల అంజిలప్ప బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లూరీ క్రాంతి కుమార్, విద్యార్థులు మరియు గ్రామస్థులు హన్మంత్ పాల్గొన్నారు. మొదటి బహుమతి శృతి మరియు నవ్యశ్రీ రెండవ బహుమతి అక్షయ మరియు హంసిక మూడవ బహుమతి సింధు మరియు అక్షత కు ఇవ్వడం జరిగింది.

# ప్రభుత్వ వసతి, కస్తూర్బా,గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులేకు పటిష్ట చర్యలు.

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జనవరి 09( సమయం న్యూస్).:** కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, ప్రభుత్వ సంక్షమ పాఠశాలలు వసతి గృహాలు క్లీనింగ్ యాక్టివిటీ, ఇంకా మెరుగైన వసతులు అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారుశుక్రవారం కుల్చారం మండలం కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి బాలికలకు అమలవుతున్న సౌకర్యాలు, విద్యా బోధన, పరిసాల పరిశుభ్రత, మెనూ, సంబంధిత వాటిని క్షణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూమండల ప్రత్యేక అధికారులతో జిల్లాలో ఉన్న అన్ని కేజీబీవీల , సంక్షమ పాఠశాలల్లో వసతి గృహాలు ప్రత్యేక పరిశీలనలు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారుప్రస్తుతం ఉన్న వసతులు, ఇంకా మెరుగైన వసతులు, కల్పన సంక్రాంతి సెలవు దినాల్లో క్లీనింగ్ యాక్టివిటీ అమలు చేస్తున్నట్లు వివరించారు. సంక్రాంతి సెలవు దినాల వారం రోజుల్లో మరలా వారు సెలవులు తర్వాత తిరిగి వచ్చేసరికి పరిశుభ్రత , ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ బాల,బాలికల చదువులకు ఎటువంటి అంతరాయం కలవకుండా వసతులు మెరుగుపరచడంలక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తరగతి గదుల దగ్గర నుంచి, స్టోర్ రూమ్ , కిచెన్ షెడ్ వరకు, క్లీనింగ్‌చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కే.జీ.బీ.వీలు , సంక్షమ పాఠశాలలో వసతి గృహాలు పరిశుభ్రతలో భాగంగా బాలికలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యం జిల్లావ్యాప్తంగా అన్ని కేజీ బీవీలు లతోపాటు అన్ని సంక్షమ వసతి గృహాలలో క్లీనింగ్ యాక్టివిటీ అమలు ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించి వారి విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంవిశేష కృషి చేస్తున్నట్లు వివరించారుఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, కుల్చారం తాసిల్దార్ శ్రీనివాసాచారి,సంబంధిత కస్తూరిబా గాంధీ విద్యాలయం ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు

# శ్రద్ధ గా చదువుకొని ఉన్నతంగా ఎదగాలి.

● చదువును మించిన ఆయుధం లేదు జిల్లా న్యాయమూర్తి-వింధ్య నాయక్



**కోస్గి మండలం, జనవరి,09(సమయం న్యూస్) :** జిల్లా న్యాయమూర్తి వింద్యా నాయక్ జీవితం లో ఏదైనా సాధించాలంటే చదువును మించిన ఆయుధం ఏదీ లేదని శ్రద్ద గా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని నారాయణపేట జిల్లా న్యాయమూర్తి వింధ్య నాయక్ విద్యార్థులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత విద్యపై నినాదాల తయారీ, పోస్టర్ మేకింగ్ అంశాలపై విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. నారాయణ పేట జిల్లా కోస్గి మండలం మీర్జా పూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీలలో ప్రతిభ కనబర్చి బహుమతులు గెల్చుకున్నారు. నినాదాల పోటీలలో ప్రథమ బహుమతి నవ్య శ్రీ (9వ తరగతి), ద్వితీయ బహుమతి మమత( 10 వ తరగతి) పోస్టర్ మేకింగ్ విభాగంలో ప్రథమ బహుమతి అక్షత (9వ తరగతి) పొందారు. శుక్రవారం వారం ఈ మేరకు జిల్లా న్యాయ స్థానం లోని తన ఛాంబర్ లో న్యాయమూర్తి వింధ్యా నాయక్ విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. ఒకే పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరస్తు మూడు బహుమతులు గెలుచుకోవడం పట్ల న్యాయమూర్తి ముచ్చట పడుతూ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు వార్ల మల్లేశంతో మాట్లాడి పాఠశాల వివరాలు తెలుసుకుని అభినందించారు.

# కె.జి.బి.వి ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి.

● మధ్యాహ్న భోజనం మెనూ తప్పకుండా పాటించాలని అధికారులకు ఆదేశం.



**ఏనుకొండ జనవరి09( సమయం న్యూస్) :** ఏనుగొండలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లలకు కల్పిస్తున్న వసతులు, బోధనా, భోజన నాణ్యత, తదితర అంశాలపై విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సెలవుల సమయంలో ఆట పాటలతో పాటు మంచి అలవాట్లు అలవరచుకోవాలని, తల్లిదండ్రుల మాట వినాలని, చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యార్థినులకు సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు గణితం, సైన్స్, తదితర బోధన విషయాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తదనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్, పప్పులో ఆకుకూరలు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. వంట సిబ్బంది ఇచ్చిన వివరణకు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ మధ్యాహ్న భోజనం మెనూ తప్పకుండా పాటించాలని, లేని పక్షంలో చర్యలు పప్పవని హెచ్చరించారు. అనంతరం స్టోర్ రూమ్, సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు.

అక్కడే ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన కలెక్టర్, సంక్రాంతి సెలవుల్లో పిల్లలతో సమయం గడపాలని, వారి అలవాట్లను గమనిస్తూ మంచి సూచనలు ఇవ్వాలని సూచించారు. కేజీబీవీలో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన తల్లిదండ్రులు, తమ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అన్ని సౌకర్యాలు అందుతున్నాయని తెలిపారు.

# ముందస్తు సంక్రాంతి సంబరాలు

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు..

● పాపిశెట్టి రాము,పాఠశాల అధ్యక్షులు డాక్టర్. డి పుల్లయ్య



**అమంగల్, జనవరి,09(సమయం న్యూస్) :** అమంగల్ పట్టణ కేంద్రంలోని స్థానిక వివేక విద్యా భారతి పాఠశాలలో శుక్రవారం రోజున భోగి మంటలతో, చూడచక్కని రంగవల్లులతో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రాము, పాఠశాల గౌరవాధ్యక్షులు డాక్టర్. డి. పుల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాల ఆవరణలో విద్యార్థినులు అలంకరించిన రంగవల్లులను పరిశీలించి భోగి మంటల ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం రంగవల్లుల పోటీలలో గెలిచిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. విద్యార్థులనుద్దేశించి సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. డాక్టర్. డి పుల్లయ్య మాట్లాడుతూ ఈ రైతుల పండుగను ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమ్మద్, ఉపాధ్యాయులు అజ్ర, మల్లేష్, స్వప్న, అరుణ, షమీమ్, రత్నకుమారి, నజీర్, మీన, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# రెండు పడుక గధుల ఇండ్ల పంపిణీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు.

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● జూనియర్ కళాశాల మైదానంలో సభ నిర్వహణ

● మంత్రుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**రామగుండం, జనవరి -09:( సమయం న్యూస్) :** జనవరి 11న రామగుండంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఇందులో రాష్ట్ర మంత్రులు పాల్గొంటున్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ తో కలిసి రామగుండం నగరంలో మంత్రుల పర్యటన నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయ పరిధిలో ఉన్న హెలిప్యాడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న సభ ఏర్పాటు, గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో కలెక్టర్ సందర్శించే అధికారులకు పాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రామగుండం నగరంలో నిర్మించిన 633 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రాష్ట్ర మంత్రులు జనవరి 11న ప్రారంభిస్తారని, టూర్ షెడ్యూల్ త్వరలో ఖరారు అవుతుందని కలెక్టర్ తెలిపారు. మంత్రుల పర్యటన సందర్భంగా గోదావరిఖని లోని జూనియర్ కళాశాల మైదానంలో 633 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు, 479 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు, 576 మంది నిరుపేదలకు ఇంటి స్థలం పట్టాలు , పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. మంత్రుల పర్యటనకు వీలుగా హెలిపాడ్ వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జూనియర్ కళాశాలలో నిర్వహించే బహిరంగ సభకు అవసరమైన బ్యారికేడ్ల, సౌండ్ సిస్టం, స్టేజ్, ప్రజలకు త్రాగు నీరు, ఇతర ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలని, మంత్రుల చేతుల మీదుగా ఇండ్ల పట్టాలు, నూతన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రొసీడింగ్స్ కాపీలు అందుకునే లబ్ధిదారుల వివరాలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతరకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డి.సి. పి.రామ్ రెడ్డి,ఆర్.డి.ఓ.గంగయ్య, ఏ.సి.పి. రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జనవరి 9,( సమయం న్యూస్).** :మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి అంజయ్య, శ్రీనిధి రీజినల్ మేనేజర్ వెంకటరమణ లతో కలిసి శ్రీనిధి రుణాలు, బ్యాంకు లింకేజ్ ల మంజూరు, రికవరీల పై జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, సెర్ప్ ఆధ్వర్యంలోని శ్రీనిధి సిబ్బంది, సామాజిక సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అన్ని రంగాలలో రాణించేందుకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. జిల్లాలో 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను శ్రీనిధి రుణాల లక్ష్యం 42 కోట్ల రూపాయలకు గాను 46 శాతంతో 19 కోట్ల 47 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రికవరీలో భాగంగా 49 శాతం రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రికవరీ పరంగా 25వ స్థానంలో కొనసాగడం జరుగుతుందని, జిల్లాలో తక్కువ రికవరీ ఉన్న మండలాల ప్రతినిధులు రికవరీ శాతాన్ని పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకు లింకేజీ విషయంలో 422 కోట్ల రూపాయలకు గాను 311 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చేయడం జరిగిందని, ఓవర్ డ్యూ 0.68 శాతంగా నమోదు అయిందని, ఈ క్రమంలో సమగ్రమైన ప్రణాళిక రూపొందించుకుని తక్కువ ప్రగతి సాధించిన మండలాలు వృద్ధి సాధించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకుల వద్ద నుంచి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలాల వారిగా కమ్యూనిటీ కో- ఆర్డినేటర్ల పని తీరు పరిశీలించి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే కమ్యూనిటీ కో- ఆర్డినేటర్ల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాలోని నస్పూర్ లో గల సి.సి. కార్నర్ లో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించడం జరుగుతుందని, ఇందులో మొదటి బ్యాచ్ లో ప్లంబింగ్, శానిటేషన్ పై నెల రోజుల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయసు గల గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో డిమాండ్ ఎక్కువగా ఉన్న పనులకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నార

# పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో టాప్ లో నిలవాలి

● కలెక్టర్ రాజర్షి షా




**బేల జనవరి 09 ( సమయం న్యూస్) :** పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాప్ లో నిలవాలనీ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బేల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దాతల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్.ఓ వాటర్ ప్లాంట్‌ను కలెక్టర్ ప్రారంభి పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు వేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో మొదట 130 పాఠశాలల్లో ప్రారంభించిన 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం, ప్రస్తుతం 250 పాఠశాలల్లో విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని, తద్వారా విద్యార్థుల అనారోగ్య సమస్యలు తగ్గి, పాఠశాల హాజరు శాతం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడా రంగంలోనూ రాణించాలని, క్రీడా రంగంలో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటలో ఉద్యగాలు సాధించవచ్చున్నారు. సిఎం కప్ క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో బేల ఉన్నత పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, జిల్లాలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పిలునిచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం దాతలు సుమారు 3 లక్షల రూపాయలు అందించారని, ఆ నిధులతో విద్యార్థుల కోసం స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతలను శాలువాలతో సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు పాఠశాలలో కిచెన్ షెడ్, ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలపై గోడలపై పెయింటింగ్ లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, దాతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆనంద్ బాగ్ లో దాదాపు 20 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్ పనులు ప్రారంభం

- మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్





**మల్కాజి గిరి జనవరి09( సమయ్దం న్యూస్). :** మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ దాదాపు 20 లక్షల రూపాయల వ్యయంతో ఆనంద్ బాగ్లో సిసి రోడ్ పనులను ప్రారంభించడం జరిగినది. వెంకటేశ్వర స్వామి దేవాలయం ఎదురుగా ఉన్నటువంటి సన్ డెంటల్ హాస్పిటల్ రోడ్డు మరియు అష్టభుజాదేవి దేవాలయానికి వెళ్ళు సిసి రోడ్డు గుంతల మయంగా ఉండడంతో దాన్ని మొదలుపెట్టడం జరిగినది.

ట్రాఫిక్ రద్దీగా ఉండేటువంటి స్థలం కావడంతో ప్రజలు రోడ్డు పని పూర్తయ్యే వరకు సహకరించాలని శ్రవణ్ ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగినది. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా కానిస్టేబుల్ ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ సిఐ గారిని చర్వాణి ద్వారా కోరడం జరిగినది. మల్కాజిగిరిలో దాదాపు అన్ని సిసి రోడ్లను పూర్తి చేసామని, ప్రజలు ఇంకేమైనా మిగిలినవి తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పూర్తి చేసేటువంటి ప్రయత్నం చేస్తానని కార్పొరేటర్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ నవీన్, రేణుక,పవన్,పి ఆర్ కే,శ్రీనివాస్, చైతన్య,మల్లికార్జున్, నందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# నేరస్తులకు శిక్షలు పడేలా సమన్వయంతో పనిచేయాలి

**● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట, జనవరి,09(సమయం న్యూస్) :** శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ డాక్టర్ వినీత్ నెల వారి నేర సమీక్ష సమావేశం నిర్వహించి నేరస్తులకు శిక్షలు పడటంలో, కేసుల ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన రెవెన్యూ, జ్యుడీషియల్, మెడికల్ డిపార్ట్మెంట్ అధికారులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీతమాట్లాడుతూ....పోలీసు దర్యాప్తులో ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించి, వాటిని త్వరితగతిన పరిష్కరించుకుంటూ కేసులను సమయపాలనతో పూర్తి చేయాలని సూచించారు. నేరస్తులకు శిక్షలు పడేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, వైద్య నివేదికలు, న్యాయ ప్రక్రియలు వేగంగా పూర్తయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన ఐవీ&ఎూ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పిపిలు), రెవెన్యూ అధికారులను జిల్లా ఎస్పీ శాలువాలతో సత్కరించి, పూల మొక్కలు అందించి అభినందించారు.

**నేరాల నియంత్రణ పై దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ**

జిల్లా పరిధిలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వాటిని అదుపు చేయడానికి మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖ్రూా తెలిపారు. జిల్లాలో నేరాల నియంత్రణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, పెండింగులో ఉన్న కేసుల వివరాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు అధికారులు సమర్ధవంతంగా కోర్టు డ్యూటీ అధికారులతో, న్యాయ, మెడికల్ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. పోక్సో ఎస్సీ ఎస్టీ కేసులలో 60 రోజుల్లో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేయాలి అని అన్నారు. ముఖ్యంగా నిఘా వ్యవస్థకు ప్రధాన సంపత్తిగా మారిన సిసి టీవీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు పెరుగుతున్న క్రమంలో సిసి కెమెరాల ఏర్పాటును మరింత ప్రోత్సహించే విధంగా పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాలని అలాగే "షి" టీమ్, లోకల్ పోలీసులు ప్రజలకు సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలని, కేసుల దర్యాప్తులో అలసత్వం వహించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎస్పి తెలిపారు. సంక్రాంతికి ప్రజలు చాలామంది ఊర్లకి వెళుతుంటారు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండి చాలామంది గ్రామాలకు వెళుతుంటారు కావున పెట్రోల్ కార్ మొబైల్స్, బ్లూ కోట్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలి. నేరాలు జరగకుండా కాలనీలో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్కు తీసుకొచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకొని ఫిర్యాదులను పెండింగ్లో లేకుండా చూడాలని ఒకవేళ పెండింగ్ ఉంటే ఎందువల్ల పెండింగ్ ఉంది ఉన్న సమాచారాన్ని వాళ్లకు తెలియపరచాలని తెలిపారు. నీతి నిజాయితీగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా డిటిఓ అధికారులతో కలిసి ప్రజలకు వాహనదారులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి సంబంధిత అధికారులతో సమన్వయం కలిగి ఉండి రోడ్డు ప్రమాదం నివారించడానికి కృషి చేయాలి అని అన్నారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఇప్పటినుండి ముందస్తు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్,జిల్లా వైద్యాధికారి (ఐవీ&ఎూ )జయ చంద్ర మోహన్,డిటిఓ మెగా గాంధీ, రిటైర్డ్ రెవెన్యూ అధికారి బాలాజీ సఫారీ, సీఐ లు శివ శంకర్, రాజేందర్ రెడ్డి, రామ్ లాల్, సైదులు,ఎస్సై లు వెంకటేశ్వర్లు, రాజు, రాముడు, విజయ్ కుమార్, బాలరాజు, రాజా శేఖర్, అశోక్ బాబు, రమేష్, రాము, ఎస్ ఎం నవీద్, సునీత, గాయత్రి, రేవతి, మహేశ్వరీ తది తరులు పాల్గొన్నారు.

# సామాజిక ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్



**ఖమ్మం, జనవరి 9 : ( సమయం న్యూస్ ) :** అట్టడుగు వర్గాల అభ్యున్నతి అభివృద్ధి చదువుతోనే సాధ్యమని వారికి చదువు విలువ తెలియజేస్తూఅందరికీ పాఠాలు చెప్పిన తొలి సామాజిక ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ అని బీ సీ, ఎస్ సీ, ఎస్ టీ జిల్లా కార్యదర్శి సంగమేశ్వర రావు ,వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి అన్నారు. శుక్రవారం రామన్న పేటలో సంఘం జిల్లా కార్యదర్శిషరీఫా బేగం ఆధ్వర్యంలో ఫాతిమా షేక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి , నివాళులు లభించారు. అనంతరం కేక్ కట్ చేశారు. తదనంతరంజరిగిన సభలో ఉపేంద్ర బాయి మాట్లాడుతూ సత్య శోధక్ సమాజ్ వ్యవస్థాపక సభ్యురాలు , చదువుల తల్లి సావిత్రిబాయి పూలే సహచరి అందరికీ చిరపరిచితురాలైన ఫాతిమా షేక్ ఆనాటి ముస్లిం సమాజం నుండి బడుగు బలహీన వర్గాల చదువుల ఆవశ్యకతను గుర్తించి , సావిత్రిబాయి పూలే తో కలిసి , మహిళలకు చదువులు చెప్పించిన ధన్యజీవి ఫాతిమా షేక్ అని కొనియాడారు. ఫాతిమా షేక్ తో పాటు సావిత్రిబాయి పూలే వంటి రోల్ మోడల్ గా నిలిచిన మహిళల స్ఫూర్తితో మన భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోహాసంఘం గౌరవ సలహాదారులు పుల్లూరి నాగయ్య , వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లాఉపా దక్షరాలు బి. జ్యోతి, ప్రధాన కార్యదర్శి స్పందన , సహాయ కార్యదర్శి కవిత , సలహాదారులు కే లక్ష్మి , మహాలక్ష్మి , రమ్య , సరోజిని , కృష్ణవేణి , జిల్లా ఇన్చార్జి జాన్ బి ,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ , బహుజన జేఏసీ నాయకులు అర్జునరావు , వీరన్న , వెంకన్న, ఎల్ హెచ్ పీ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# సంక్రాంతి వేడుకలు ఆనందంగా జరుపుకోవాలి

**● ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి**

**● మీర్జాపూర్ లో ఆకట్టుకున్న రంగోళి**






**కోస్గి మండలం, జనవరి,09(సమయం న్యూస్) :** రాబోయే సంక్రాంతి పండుగ వేడుకలు ఆనందంగా జరుపుకోవాలని ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి సూచించారు. సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం రోజు నారాయణపేట జిల్లా కోస్గి మండలం మిర్జాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రంగోళి పోటీలలో, గాలిపటాల తయారీ పోటీలలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటారు. 8 వ తరగతి విద్యార్థుల అతిపెద్ద ముగ్గు 6వతరగతి విద్యార్థులు తయారు చేసిన బాహుబలి గాలిపటం అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పతంగులు ఎగురవేసే క్రమంలో తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు భవనాలు, మేడలు, విద్యుత్ తీగల వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రతిభ కనపరుస్తూ గాలిపటాలు తయారు చేసిన, ముగ్గులు వేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్రాములు, త్రిగుణ వార్ల మల్లేశం, భీమయ్య, రహమత్ పాషా, సంతోష్ మల్లయ్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# జిజ్ఞాస హై స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు





**రాయపోల్,జనవరి 9:** జిజ్ఞాస హై స్కూల్ గజ్వేల్ ప్రాంగణం శుక్రవారం సంక్రాంతి సంబరాలతో కళకళలాడింది. ముందస్తుగా నిర్వహించిన సంక్రాంతి వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు హాజరై పండుగ శోభను మరింత పెంచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు, పండుగకు ప్రత్యేకమైన అలంకరణలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంక్రాంతి ప్రాముఖ్యతను తెలిపే పాటలు,నృత్యాలతో అలరించగా,పండుగ సంస్కృతి, సంప్రదాయాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ కర్ణకర్ మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి,ఐక్యతకు ప్రతీకలని,చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో సంప్రదాయాలపై గౌరవం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేడుకలు విద్యార్థులకు మరిచిపోలేని అనుభూతిని అందించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని,విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతి గృహాల్లో నీ విద్యార్థులకు ఉలెన్ బ్లాంకెట్లు పంపిణీ..



**సంగారెడ్డి జనవరి09( సమయ్దం న్యూస్).:** ప్రభుత్వ వసతి గృహాలలో ఉండే పేద విద్యార్థులకు సేవ చేయాలని మంచి ఉద్దేశంతో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు టి. అఖిలేష్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ చూపి జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ తీర్చు నాయక్ గారు ఆధ్వర్యంలో ఉలెన్ బ్లాంకెట్ పంపిణీ కార్యక్రమం సమీకృత బాలుర వసతి గృహం సంగారెడ్డి నందు శుక్రవారం నిర్వహించడం జరిగింది. నాయక్ గారు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయి శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షంచారు . పేద విద్యార్థులకు ఈ విధంగా సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. ఈ ఉలెన్ బ్లాంకెట్లను సత్య దివిస్ ఫార్మ సూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ గడ్డపోతారం జనరల్ మేనేజర్ ఏ నాగేశ్వరరావు గారి సహకారంతో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు సహాయ సాంఘిక సంక్షమ అధికారి బి శంకర్ గారు వసతి గృహ సంక్షమ అధికారులు, మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# భోజనోత్సవం (ఫుడ్ ఫెస్టివల్)

**● ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ ఉపసర్పంచ్ మరియు మండల విద్యాధికారి రామిరెడ్డి**



**కొడంగల్ మండలం, జనవరి,09(సమయం న్యూస్) :** కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం భోజనోత్సవం (ఫుడ్ ఫెస్టివల్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ జ్యోతి ఉపసర్పంచ్ చంద్రకళ అలాగే ఏఏపిసి అధ్యక్షురాలు వసంత లు విద్యార్థులు చేసిన వంటల రుచి చూస్తూ వారిని అభినందించారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి రామిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఇలా భోజనోత్సవం (ఫుడ్ ఫెస్టివల్) నిర్వహించడం వల్ల వీరికి జంక్ ఫుడ్ మరియు పౌష్టికాహారం పై అవగాహన కలుగుతుంది అని దీనివల్ల వారి ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫుడ్ ఫెస్టివల్ కి ఉపాధ్యాయులు గోవర్ధన్ అబ్దుల్ హక్ రాజు నాగప్ప జ్యోతి తదితరులు పాల్గొని ప్రశంసించారు అనంతరం ఫుడ్ ఫెస్టివల్ లో పాల్గొన్న విద్యార్థులందరికీ అలాగే పౌష్టికాహారాన్ని రుచి చూపించిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు.

# సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన కాఫీ టేబుల్ బుక్ ను ఆవిష్కరణ

**● సి ఎస్ కే రామకృష్ణ రావు.**



**హైదరాబాద్, జనవరి 09,( సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కే. రామకృష్ణ రావు, ఐఏఎస్ హైదరాబాద్‌లో సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన ప్రతిష్ఠాత్మక కాఫీ టేబుల్ బుక్ ను ఆవిష్కరించారు. ఈ గ్రంథం భారతదేశ కార్టోగ్రాఫిక్, శాస్త్రీయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ బి.సి. పరిడా, డైరెక్టరం, సర్వే ఆఫ్ ఇండియా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. జియోడెటిక్ ఆస్తుల నమోదు, జియోస్పేషియల్ విజ్ఞానం ప్రణాళిక, భూ పరిపాలన, మౌలిక సదు-పాయాల అభివృద్ధికి కీలకమని అధికారులు తెలిపారు. ఈ ప్రచురణ వికసిత భారత్ లక్ష్యానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు.

# రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మైనార్టీలకు కూడా అవకాశం ఇవ్వాలి

**● ఎస్ఎం. గౌసన్, మైనారిటీ నాయకులు, కొడంగల్**



**కొడంగల్ మున్సిపల్, జనవరి,09(సమయం న్యూస్) :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మైనారిటీ లకు చైర్మెన్, వైస్ చైర్మన్ పదవుల్లో అవకాశం కల్పించాలి. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, మద్దూర్, కొడంగల్ మున్సిపాలిటీ ల్లో ఏదైనా ఒక మున్సిపాలిటీలో మైనారిటీ లకు చైర్మెన్, వైస్ చైర్మన్ గా అవకాశం కల్పించాలని మైనార్టీ నాయకులు ఎస్.ఎం గౌసన్ కోరారు. ప్రభుత్వాలు మైనారిటీ లను ఓటు బ్యాంకు గా మాత్రమే చూడటం సరైంది కాదు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మైనారిటీ లకు సము చిత స్థానం కల్పించాలని అన్నారు.

## సర్వీసు పుస్తకాల అందజేత



**కొడంగల్ మున్సిపల్(మం)జనవరి,09(సమయం న్యూస్) :** డీఎస్సీ 2024 ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు శుక్రవారం్రా=ఖియా కొడంగల్ మండల శాఖ తరపున సర్వీస్ పుస్తకాలు అందజేశారు. కొడంగల్ మండల శాఖ అధ్యక్షలు అబ్దుల్ హాక్ ప్రధాన కార్యదర్శి టి దినేష్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామ్ రెడ్డి సంఘ రాష్ట నాయకులు గోపీనాథ్ ఆనంద్ రావు దుబ్బాస్ రవి విశ్రాంత ఉపాధ్యాయులు రాధాకృష్ణ యాదగిరి జిల్లా నాయకులు మహేశ్వరి రజిత తదితరు పాల్గొన్నారు

## పరిగి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం లక్ష్యం

-- కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి



**పరిగి మున్సిపల్, జనవరి,09(సమయం న్యూస్) :** పరిగి పట్టణంలో పరిగి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి పాల్గొని, రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యకర్తలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిగి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం కావాలంటే ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీపై ఉన్న విశ్వాసాన్ని మరింత బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించే దిశగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని, బూత్ స్థాయి కమిటీలను మరింత చురుకుగా పనిచేయించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ప్రభాకర్ ఎంపిక



**రాయపోల్,జనవరి 9:** తెలంగాణ రాష్ట్ర సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఇటీవల కామారెడ్డి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళాలో సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం జెడ్పీహెచ్ బేగంపేట పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రభాకర్ రూపొందించిన మ్యాథ్స్ సంబంధిత టీఎల్‌ఎం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులకు గణితాన్ని సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన ఈ టీఎల్‌ఎం ను రాష్ట్రస్థాయి జ్యూరీ ప్రశంసిస్తూ దక్షిణ భారత (సౌత్ ఇండియా) సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేశారు. రాష్ట్రం నుంచి ఎంపిక కావడం ద్వారా ప్రభాకర్ జిల్లా, మండలానికి గర్వకారణంగా నిలిచారు.

ఈ సందర్భంగా సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రభాకర్ ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని వినూత్న బోధనా సాధనాలు రూపొందించాలని ఆకాంక్షించారు. ఆయన విజయం ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచిందని వారు పేర్కొన్నారు.

## ఘనంగా ప్రీ సంక్రాంతి పండుగ సంబరాలు

- గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన...
- పాఠశాల కరస్పాండెంట్ పాహిపాల్ రెడ్డి



**యాలాల మండలం, జనవరి,09(సమయం న్యూస్) :** యాలాల మండలం లోని గౌతమి పాఠశాలలో ప్రీ సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ పాఠశాల విద్యార్థులు ముగ్గులు, రంగవ ళ్ళులతో అలంకరించారు. అనంతరం గొబ్బెమ్మలు, రేగిపళ్ళు, భోగిమంటలు, పతంగులను విద్యార్థులు ఎగరవేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ మహిపాల్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సంగారెడ్డి ప్రిన్సిపాల్ కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

# పరిగి లో అభివృద్ధి పనులు ప్రారంభం

- ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి



**పరిగి మున్సిపల్, జనవరి,09(సమయం న్యూస్) :** పరిగి పట్టణంలోని 12, 13, 15 వార్డులలో రూ.50 లక్షల ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన సిసి రోడ్లను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం 14వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త బోర్ వెల్ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించి, పనులకు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదురుగా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న పబ్లిక్ టాయి లెట్స్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం నస్కల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి, పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబా టులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.50 కోట్లతో పనులు టెండర్ దశలో ఉన్నాయి సీసీ రోడ్లు, మురికి కాలువలు, పట్టణంలోని అన్ని వార్డులలో రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, పరిగి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు పార్థసారథి పంతులు, పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్వర్, పాలాద్రి శ్రీనివాస్ గుప్తా, కడుమూరి శ్రీను, దండు అశోక్, అనెం ఆంజనేయులు, తౌరియా నాయక్, కుడుములు వెంకటేష్, అక్బర్, శ్రీధర్ నస్కల్ వెంకటయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, రవి కాంత్ రెడ్డి, గణేష్ అలాగే మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి
- బస్తీ దవాఖానకు ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**నిజామాబాద్, జనవరి 09( సమయం న్యూస్).:** ప్రజల ఆరోగ్యాల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతి సదుపాయాలు, నిష్ణాతులైన వైద్యులను అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వపరంగా సర్కారీ దవాఖానాల ద్వారా ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోధన్ పట్టణంలోని 32వ వార్డు పరిధిలో పాత చావిడి భవనంను అన్ని విధాలుగా ఆధునీకరించి నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. బస్తీ దవాఖాలోని వివిధ విభాగాలను పరిశీలించి, అందుబాటులోకి వచ్చిన వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు స్థానికంగానే ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో బస్తీ దవాఖానాను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ కేంద్రంలో అన్ని రకాల వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు నిర్వహిస్తూ, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని అన్నారు. ప్రజలు, ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్య తనిస్తూ, ఉచిత ఆరోగ్య సేవలను వినియోగిం చుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి డబ్బులు ఖర్చు చేసుకోకూడదని హితవు పలికారు.

### సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కోసం ఎంపిక చేసిన స్థల పరిశీలన

కాగా, అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహ సముదాయం కోసం బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ ప్రాంతంలో ఎంపిక చేసిన స్థలాన్ని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ళ నిర్మాణానికి ఈ స్థలం అనువుగా ఉందని, త్వరలోనే పనులు ప్రారంభించి గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ గడుగు గంగాధర్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, బోధన్ తహసిల్దార్ విట్టల్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన

- మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్




**మద్దూర్ మున్సిపల్,(మం)జనవరి,09(సమయం న్యూస్)**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా AMVI దీప్తి మరియు మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మద్దూర్ మండల కేంద్రంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మద్దూరు ఉర్దూ మీడియం హై స్కూల్ లో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు .రోడ్డు భద్రతపై చిన్నతనం నుంచే అవగా హన కల్పించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని వారు తెలిపారు. అదే విధంగా జెడ్పిహెచ్ఎస్ మద్దూర్ హై స్కూల్ లో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, రహదారులపై నడిచే విధానం, ట్రాఫిక్ సంకేతాల ప్రాముఖ్యత, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని వివరించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి, ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరడమే మనందరి లక్ష్యం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ జనవరి09( సమయం న్యూస్). :** ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే మనందరి లక్ష్యంగా మార్చుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకోని నగర ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు హెల్మెట్ ప్రాదాన్యతపై అవగాహన కల్పించడం కోసం వరంగల్ ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో బైక్ ర్యాలీని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా హాజరయి ర్యాలీ ప్రారంభించిన అనంతరం పోలీస్ కమిషనర్ సైతం అధికారులు, సిబ్బందితో కలసి హెల్మట్లను ధరించి బైక్ ర్యాలీ పాల్గోన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ మైదానం నుండి ప్రారంభమైన హన్మకొండ చౌరస్తా, ములుగు రోడ్, యం.జి.యం, పోచమ్మమైదానంలోని ఎస్.ఆర్ కళాశాల వరకు కొనసాగింది. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్య మారిందని, ముఖ్యంగా ఈ ప్రమాదాలు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడమే కారణరమవుతోందని. ప్రధానం హత్యలు కన్నా రోడ్డు ప్రమాదాల కారణంగా మరణించిన వారి సంఖ్య అధికమని. పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడితే కొద్ది వరకు రోడ్డు ప్రమాదాలను నివారించగలం కాని వాహనదారులు తమ వ్యక్తిగత బాధ్యతగా భావించి ట్రాఫిక్ నిబంధనలను పాటించడం అవలంబిస్తే ప్రస్తుతం జరిగే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టగలమని, గత ఏడాది వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన రొడ్డు ప్రమాదాల కారణంగా 450కు పైగా మృత్యువాత పడ్డారని, అలాగే తోమ్మిడి లక్షల మంది వాహనదారులకు హెల్మెట్ ధరించని కారణంగా జరిమానాలు విధించడం జరిగిందని. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపటం కారణంగా వాహదారునితో పాటు ఇతరులు సైతం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని. ప్రతి వాహన దారుడు హెల్మెట్ ధరించాలని, మైనర్లను వాహనాలను అందజేయవద్దని, కారు నడిపే సమయంలో తప్పని సరిగా సీట్ బెల్ట్ ధరించడంతో ఇతర ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షతంగా మీ ఇండ్లకు చేరుకోవాలని, రోడ్డు భద్రతతో పాటు, ప్రస్తుత రోజుల్లో మత్తుపదార్థాల, సైబర్ నేరాలు సైతం ప్రస్తుతం మనందరి ముందు పెద్ద సమస్యని, యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని, వాటిని వినియోగించడం ద్వారా భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, ఎవరైనా మట్టు పదార్థాలు వినియోగించిన, విక్రయించిన పోలీసులకు సమచారం ఇవ్వాలని, అలాగే సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తం వుందాలని, తప్పుడు ప్రకటనలు, ఉచితాలు, ఉద్యోగాలు, లక్కీడ్రా, డిజిటల్ అరెస్టులను ప్రజలు నమ్మవద్దని, ఎవరైన సైబర్ నేరానికి గురైతే తక్షణమే 1930 నంబర్‌కు సమచారం అందించాలని పోలీస్ కమిషనర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమములో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, వరంగల్ ఏ.ఎస్పీ శుభం, అదనపు డిసిపిలు ప్రభాకర్ రావు,శ్రీనివాస్,సురేష్‌కుమార్, ఏసిపి సత్యనారయణ,ప్రశాంత్ రెడ్డి, సురేంద్ర,నాగయ్య, జాన్ నర్సింహులతో పాటు ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్లు సీతారెడ్డి,వెంకన్న,సుజాతతో పాటు నగరానికి చెందిన ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు,ఎస్.ఐలు పోలీస్ సిబ్బంది, స్థానిక యువత ఈ ర్యాలీ ఉత్సహంగా పాల్గోన్నారు.




## కెంద్రా లస్ట్‌తో విరాట్ కోహ్లీ..?

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అతనికి భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. శత్రు దేశం పాకిస్థాన్‌లోనూ కోహ్లీ అంటే పడి చచ్చే అభిమాన గణం ఉంది. దాంతో కోహ్లీ తరుచూ వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. అయితే తాజాగా కెంద్రా లస్ట్ అనే అమెరికా శృంగార తార.. సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీతో ఉన్న ఫోటోను పంచుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అనుకోకుండా టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీని యూకేలో కలిసానని కెంద్రా లస్ట్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఫోటోను పంచుకుంది. ఈ పోస్ట్‌కు కెంద్రా లస్ట్.. 'అనుకోకుండా జరిగే సమావేశాలు ఎప్పుడూ అత్యుత్తమంగా ఉంటాయి. ఎంత గొప్ప స్ఫూర్తి, నిజంగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి'అనే క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫోటో క్షణాల్లో వైరల్ కాగా.. ఇది ఫేక్ అంటూ అభిమానులు తేల్చేసారు. ఏఐ జనరెటేడ్ ఫోటో అని కామెంట్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ కుటుంబం లండన్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నప్పటికీ.. గత నెలరోజులుగా భారత్‌లోనే ఉన్నాడు. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ ఆడేందుకు భారత్‌కు వచ్చిన కోహ్లీ.. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్దమవుతున్నాడు. అలాంటిది కోహ్లీని యూకేలో కెంద్రా లస్ట్ ఎలా కలిసిందని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కెంద్రా లస్ట్ తరుచూ ఏఐ జనరేటేడ్ ఫొటోలను పంచుకుంటుంది. ఇటీవల భారత బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్‌ను కలిసినట్లు ఏఐ జనరేటెడ్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకొని వార్తల్లో నిలిచింది. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న విరాట్ కోహ్లీ.. తనకు అచ్చొచ్చిన ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్నాడు. ఆదివారం వడోదర వేదికగా జరిగే తొలి వన్డేతో మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరపున రెండు మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ సెంచరీ, హాఫ్ సెంచరీ( 131, 77)తో రాణించాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు బాది 302 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.



## ఎప్పటికీ రోహితే నా కెప్టెన్!

### ఐసీసీ ఛైర్మన్ జై షా

టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మను ఐసీసీ ఛైర్మన్ జై షా 'కెప్టెన్ల అని సంబోధించాడు. దీనికి అక్కడున్న రోహిత్ శర్మ కూడా నవ్వులు చిందించాడు. రీసెంట్?గా రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహించిన ఈవెంట్?లో టీమ్ఇండియా క్రికెటర్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, హర్మన్ ప్రీత్ కౌర్‌తోపాటు జై షా కూడా పాల్గొన్నాడు. ఈ ఈవెంట్‌లో మాట్లాడిన జై షా హిట్‌మ్యాన్‌ను కెప్టెన్ అంటూ పిలిచాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'మన కెప్టెన్ ఇక్కడే కూర్చొని ఉన్నాడు. అతడు టీమ్ఇండియాకు అతడు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించాడు. అందుకే నేను రోహిత్‌ను కేవలం కెప్టెన్ అనే పిలుస్తా. 2023 వరల్డ్‌కప్ టోర్నీలో భారత్ వరుసగా పది మ్యాచ్‌ల్లో నెగ్గింది. కానీ, ఆ టోర్నీలో ట్రోఫీ నెగ్గలేకపోయినా, మన జట్టు అభిమానుల హృదయాలు గెలుచుకుంది. తర్వాత నేను 2024 ఫిబ్రవరిలో రాజ్‌కోట్ వేదికగా ఓ విషయం చెప్పాను. వచ్చే ప్రపంచకప్‌లో ట్రోఫీతోపాటు అభిమానుల హృదయాలను కూడా గెలుచుకోబోతున్నాం' అని ఆ ఈవెంట్‌లో జై షా అన్నారు.ఇక ఇదే ఈవెంట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ సైతం 2024 టీ20 వరల్డ్‌కప్ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలోనే రోహిత్ శర్మపై ప్రశంసలు కురిపించారు. రోహిత్ శర్మ జర్నీ గురించి చెబుతూ అతడు యువతకు స్ఫూర్తి అని అన్నారు. 'రోహిత్ చిన్నప్పుడు తన గ్రాండ్ పేరెంట్స్ వద్ద ఉండేవాడు. క్రికెట్ ప్రాక్టీస్ కోసం కిట్‌తో బొరివాలి నుంచి చర్చ్‌గేట్‌దాకా లోకల్ ట్రైన్‌లో ప్రయాణించేవాడు. అలా ఒక్కో మెట్టు ఎక్కుతూ టీమ్ఇండియా కెప్టెన్ దాకా ఎదిగిన తీరు అద్భుతం. అలా రోహిత్ భారత క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాళ్లో ఒకడిగా నిలిచాడు. అతడి జర్నీ ప్రపంచానికే స్ఫూర్తి. అతడో ఐకానిక్ల అని నీతా అంబానీ అన్నారు.కాగా, రోహిత్ శర్మ 2021లో టీమ్ఇండియా ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా బాధ్యతలు అందుకున్నాడు. 2022 టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్‌లో భారత్ ఓడింది. కానీ ఆ తర్వాత వరుసగా ఆడిన మూడు ఐసీసీ టోర్నీల్లో భారత్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు రోహిత్. అతడి కెప్టెన్సీలోనే టీమ్ఇండియా ఏడాది కాలంలో రెండుసార్లు ఐసీసీ టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది.అలా భారత్ క్రికెట్ జట్టు దాదాపు 17ఏళ్ల తర్వాత 2024లో టీ20 వరల్డ్‌కప్, అలాగే 8ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది రోహిత్ కెప్టెన్సీలోనే. దీంతో భారత్‌కు ఒకటి కంటే ఎక్కువ ఐసీసీ ట్రోఫీలు అందించిన రెండో కెప్టెన్‌గా ధోనీ తర్వాతి స్థానంలో నిలిచాడు. అలా కెప్టెన్‌గా కొంతకాలమే జట్టును నడిపించినప్పటికీ రోహిత్ తనదైన ముద్ర వేశాడు.రోహిత్ సారథ్యంలో 56 వన్డేల్లో భారత్ ఏకంగా 42 విజయాలు సొంతం చేసుకుంది. మరో 12 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ టై కాగా, ఇంకో వన్డేలో ఫలితం తేలలేదు. ఇక టీ20లల్లోనూ రోహిత్ కెప్టెన్సీ రికార్డు ఘనంగానే ఉంది. 62 మ్యాచ్?ల్లో 49 టీ20ల్లో టీమ్ఇండియా విజయం సాధించింది. టీ20 ఫార్మాట్లో అతడి విన్నింగ్ పర్సంటేజ్ 79.03గా ఉంది.కాగా, 2024 వరల్డ్?కప్ ఫైనల్ అనంతరం రోహిత్ టీ20లకు గుడ్‌బై చెప్పేశా. ఇక గతేడాది మే నెలలో సుదీర్ఘ ఫార్మాట్ టెస్టులకు కూడా రిటైర్మెంట్ పలికాడు. ప్రస్తుతం అతడు వన్డేల్లోనే ఆడుతున్నాడు. అయితే గతేడాది ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు రోహిత్‌ను బీసీసీఐ కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించింది. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను మేనేజ్‌మెంట్ వన్డే, టెస్టు ఫార్మాట్‌కు కెప్టెన్‌గా నియమించింది. ఇక టీ20లకు సూర్యకుమార్ యాదవ్ సారథిగా వ్యవహరిస్తున్నాడు.

# ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టి వైభవ్ సూర్యవంశీ వైపు

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. జింబాబ్వే వేదికగా జరగనున్న అండర్-19 వరల్డ్ కప్ 2026 కోసం భారత జట్టు ఇప్పటికే అక్కడికి చేరుకుంది. జనవరి 15న అమెరికాతో జరిగే మ్యాచ్‌తో భారత్ తన వేటను ప్రారంభించనుంది. అయితే ఈ టోర్నీలో వైభవ్ ఒక భారీ లక్ష్యాన్ని తన కళ్లముందు ఉంచుకున్నాడు. అదే మిషన్ 607. ఈ సంఖ్య వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటో తెలిస్తే మీరు షాక్ అవుతారు.అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఆయిన్ మోర్గాన్ పేరిట ఉంది. మోర్గాన్ 2004 మరియు 2006లో ఐర్లాండ్ తరపున ఆడి మొత్తం 606 పరుగులు చేశాడు. అయితే వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి 607 పరుగులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మోర్గాన్ ఈ ఘనతను రెండు వరల్డ్ కప్ లలో సాధించగా, వైభవ్ మాత్రం తన అద్భుత ఫామ్‌తో ఈ ఒక్క టోర్నీలోనే ఆ మైలురాయిని చేరుకోవాలని చూస్తున్నాడు. ఇది వినడానికి కష్టంగా అనిపించినా, వైభవ్ బాదుడు చూస్తుంటే అది అసాధ్యమేమీ కాదనిపిస్తోంది.ఇటీవల జరిగిన సౌతాఫ్రికా పర్యటనలో




వైభవ్ సూర్యవంశీ చెలరేగిపోయాడు. ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ టీమిండియాకు 3-0తో వన్డే సిరీస్‌ను అందించాడు. బౌలర్ ఎవరైనా సరే ఏమాత్రం కనికరం లేకుండా స్టేడియం బయటకు పంపడమే వైభవ్ స్టైల్. అదే ఊపును ఇప్పుడు వరల్డ్ కప్ లో కూడా కొనసాగించాలని కోరుకుంటున్నాడు. ముఖ్యంగా ఓపెనర్ గా వైభవ్ ఇచ్చే మెరుపు ఆరంభాలు భారత్‌కు కొండంత బలాన్ని ఇస్తున్నాయి.వరల్డ్ కప్ మెయిన్ మ్యాచుల కంటే ముందు వైభవ్ రెండు వార్మప్ మ్యాచుల్లో తన సత్తా చాటనున్నాడు. జనవరి 10న స్కాట్లాండ్‌తో, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. ఇక అసలైన టోర్నీలో జనవరి 15న అమెరికాతో, 17న బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడుతుంది. మూడో లీగ్ మ్యాచ్ జనవరి 24న జరుగుతుంది. ఫిబ్రవరి 3, 4 తేదీల్లో సెమీ ఫైనల్స్, ఫిబ్రవరి 6న గ్రాండ్ ఫైనల్ జరగనుంది. వైభవ్ గనుక ఫైనల్ వరకు తన ఫామ్‌ను కొనసాగిస్తే మిషన్ 607 సాధించడం నల్లేరు మీద నడకే. అతి చిన్న వయసులోనే ఎంతో పరిణతితో ఆడుతున్న వైభవ్ సూర్యవంశీ, భారత క్రికెట్ భవిష్యత్తు ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు. మరి ఆయిన్ మోర్గాన్ 20 ఏళ్ల నాటి రికార్డును వైభవ్ తుడిచిపెట్టగలడా? లేదా అనేది చూడాలి. క్రికెట్ అభిమానులంతా ఈ యువ కెరటం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సెమీఫైనల్లో పీవీ సింధు



గాయం నుంచి కోలుకొని కొత్త సీజన్‌లో తొలి టోర్నీ బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దుమ్మురేపుతోంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 1000 టోర్నీలో సింధు సెమీఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ మధ్యఅబక్రీశ్రీలోనే జపాన్ ప్లేయర్ అకానే యమగుచి గాయంతో తప్పుకోవడంతో సింధు సెమీస్‌కు దూసుకెళ్లింది. యమగుచి ఆట నుంచి తప్పుకోవడానికి ముందు సింధు 21-11తో తొలి గేమ్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో ప్రపంచ మూడో ర్యాంకర్ యమగుచితో ముఖాముఖి పోరును 15-12తో 18వ ర్యాంకర్ సింధు మెరుగుపర్చుకుంది. శనివారం జరిగే సెమీఫైనల్లో చైనా షట్లర్, రెండో సీడ్ వాంగ్ జియితో సింధు తలపడనుంది. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో సింధు 21-14, 22-20తో సుంగ్ షువో యున్(చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-8, 21-13తో ప్రపంచ 9వ ర్యాంకర్ టొమోకా మియజకి(జపాన్)ను ఓడించింది. కేవలం 33 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను సింధు ముగించడం విశేషం. క్వార్టర్ ఫైనల్లో యమగుచి గాయం సింధుకు కలిసొచ్చింది.పురుషుల డబుల్స్‌లో భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పోరాటం క్వార్టర్స్‌లో ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 10-21, 21-23 తేడాతో ఎమ్ఎస్ ఫిక్రి-ఎఫ్ అల్ఫియాన్ జోడి చేతిలో ఓటమిపాలైంది.

## రియాన్ పరాగ్‌కు ఛాన్స్ లభించేనా?




టీమిండియా యువ సంచలనం తిలక్ వర్మ గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరగబోయే మొదటి మూడు టీ20లకు దూరమయ్యాడు. విజయ్ హజారే ట్రోఫీ ఆడుతున్న సమయంలో అతనికి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో రాజ్‌కోట్‌లో అత్యవసరంగా సర్జరీ చేశారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నప్పటికీ, మైదానంలోకి రావడానికి కనీసం రెండు వారాల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో తిలక్ వర్మ స్థానంలో ఎవరిని తీసుకోవాలనే చర్చ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటర్ ఆకాష్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీసీసీఐ అధికారిక సమాచారం ప్రకారం.. బుధవారం జనవరి 7న తిలక్ వర్మకు పొత్తికడుపులో వచ్చిన సమస్య కారణంగా సర్జరీ జరిగింది. గురువారం ఉదయం అతను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ప్రస్తుతం విశ్రాంతి కోసం హైదరాబాద్ వస్తున్న తిలక్, గాయం పూర్తిగా మానిన తర్వాతే మళ్ళీ ట్రైనింగ్ మొదలుపెడతాడు. దీనివల్ల న్యూజిలాండ్‌తో జరిగే మొదటి మూడు టీ20లకు అతను అందుబాటులో ఉండడు. మిగిలిన రెండు మ్యాచ్‌లలో ఆడతాడా లేదా అనేది అతని రికవరీని బట్టి బోర్డు నిర్ణయిస్తుంది. తిలక్ వర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్ లేదా యశస్వి జైస్వాల్‌ను తీసుకోవాలని చాలా మంది అంటున్నప్పటికీ, ఆకాష్ చోప్రా మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారు. దానికి ఆయన ఒక లాజిక్ చెప్పారు. "మీకు కావాల్సింది ఓపెనర్ కాదు, ఎందుకంటే తిలక్ వర్మ 3 లేదా 4వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. కాబట్టి మిడిల్ ఆర్డర్‌లో ఆడే ప్లేయర్ కావాలి. గిల్, జైస్వాల్ ఇద్దరూ ఓపెనర్లు, కాబట్టి వారిని రిప్లేస్‌మెంట్ గా చూడలేం" అని ఆకాష్ వివరించారు. తిలక్ వర్మ స్థానంలో ఆకాష్ చోప్రా ముగ్గురి పేర్లను సూచించారు. అందులో మొదటిది శ్రేయస్ అయ్యర్ (సర్పంచ్ సాబ్). ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో అయ్యర్ మంచి ఫామ్‌లో ఉన్నాడని, అతనికి అంతర్జాతీయ అనుభవం కూడా తోడవుతుందని ఆకాష్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ అయ్యర్ కాకపోతే రెండో ఆప్షన్ గా రియాన్ పరాగ్ పేరు చెప్పారు. పరాగ్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో కూడా ఉపయోగపడతాడు. ఇక మూడో ఆప్షన్ గా ఫినిషర్ రోల్ కోసం జితేష్ శర్మ పేరును ఆయన ప్రస్తావించారు. న్యూజిలాండ్ లాంటి బలమైన జట్టుపై పోరాడాలంటే మిడిల్ ఆర్డర్ బలంగా ఉండాలి. తిలక్ వర్మ దూరం అవ్వడం టీమ్ ఇండియాకు లోటే అయినప్పటికీ, శ్రేయస్ అయ్యర్ లాంటి సీనియర్ ప్లేయర్ జట్టులోకి వస్తే అది అదనపు బలం అవుతుంది. సెలెక్టర్లు ఆకాష్ చోప్రా సూచనలను పాటిస్తారా లేదా అనేది చూడాలి. తిలక్ వర్మ త్వరగా కోలుకోవాలని కోరుకుందాం.

## రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసకర శతకం



న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు ఎంపికవ్వని రుతురాజ్ గైక్వాడ్.. తన బ్యాట్‌తోనే సెలెక్టర్లకు సమాధానమిచ్చాడు. విధ్వంసకర శతకంతో చెలరేగి వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. 'నీ అవ్వ నన్నే తప్పిస్తారా?' అని బౌలర్లను శతక్కొట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా గురువారం గోవాతో జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసకర సెంచరీతో అరాచకం సృష్టించాడు. తద్వారా లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 20 శతకాలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను విరాట్ కోహ్లీ, బాబర్ ఆజామ్ ఆల్‌టైమ్ రికార్డ్‌లను బద్దలుకొట్టాడు.శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్ గాయాల నేపథ్యంలో సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియా పిలుపును అందుకున్న రుతురాజ్ గైక్వాడ్.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో నాలుగో స్థానంలో బరిలోకి దిగాడు. తొలి వన్డేలో విఫలమైనా..రెండో వన్డేలో సెంచరీతో చెలరేగాడు. మూడో వన్డేలో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. అయితే గిల్, అయ్యర్ అందుబాటులోకి రావడంతో న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ నుంచి రుతురాజ్ ఉద్వాసనకు గురయ్యాడు.ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. రాబిన్ ఊతప్ప అయితే.. భారత సెలెక్టర్లపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ముంబై, ఢిల్లీ, పంజాబ్ ఆటగాళ్లకే భారత జట్టులో సుస్థిరం స్థానం ఉంటుందని, రుతురాజ్‌కు అన్యాం జరిగిందని మండిపడ్డాడు.రుతురాజ్ గైక్వాడ్ మాత్రం సెలెక్టర్ల నిర్ణయంపై స్పందించలేదు. మౌనంగా తన బ్యాట్‌తోనే వారికి దిమ్మతిరిగే బదులిచ్చాడు. గోవాతో మ్యాచ్‌లో 2 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న మహారాష్ట్రను రుతురాజ్ సెంచరీతో ఆదుకున్నాడు. 131 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 134 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దాంతో మహారాష్ట్ర 249 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ చేసి 3 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇది రుతురాజ్ గైక్వాడ్‌కు 20వ లిస్ట్-ఏ సెంచరీ.అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన బ్యాటర్‌గా రుతురాజ్ నిలిచాడు. 95 ఇన్నింగ్స్‌ల్లోనే అతను ఈ ఫీట్ అందుకున్నాడు. ఈ క్రమంలో కోహ్లీ, బాబర్ ఆజామ్ రికార్డులను బద్దలు కొట్టాడు. 131 లిస్ట్-ఏ ఇన్నింగ్స్‌ల్లో బాబర్ ఆజామ్ 20 శతకాలు నమోదు చేయగా.. కోహ్లీ 143 ఇన్నింగ్స్‌ల్లో 20 సెంచరీలు అందుకున్నాడు.లిస్ట్-ఏ క్రికెట్‌లో కనీసం 50 ఇన్నింగ్స్‌లు ఆడిన ఆటగాళ్లలో అత్యధిక సగటు కలిగిన బ్యాటర్‌గా రుతురాజ్ గైక్వాడ్ నిలిచాడు. అతని సగటు 58.83 కాగా.. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైఖేల్ బెవాన్ 57.86 సగటుతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. దేశవాళీ క్రికెట్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లోనూ తన సత్తా నిరూపించుకున్నా రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశాలు ఇవ్వకపోవడంపై మాజీ క్రికెటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేయాల్సిందని రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మిడిలార్డర్‌లో అతను స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడుతాడని, అతన్ని జట్టులో కొనసాగించాల్సిందని అభిప్రాయపడ్డాడు.



# ఫర్వాలేదనిపించుకున్న రాజా సాబ్

బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ స్జబెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి అల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ. నాయనమ్మకి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది. సత్య పాత్ర రాజ్ మహాల్ ప్రవేశం, అక్కడ జరిగిరే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహాల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. కనకరాజు పాత్రలో సంజయ్ దత్ చేసే హిప్నటిజం ఆడియన్స్ కి ఇంకా బలంగా రిజిస్టర్ చేయాల్సింది. బోమన్ ఇరానీ పాత్ర వచ్చే వరకూ చాలా విషయాలు కన్ఫ్యుజన్ లోనే వుంటాయి. అలాగే ఆ మహల్ ప్రవేశించిన పాత్రలు పెద్ద సవాళ్లు ఎదురుకావు. కామెడీ కూడా సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఆడియన్స్ కి జరుగుతున్న సంఘటనలపై ఆసక్తి తగ్గుతుంది. కాకపోతే ప్రీక్లైమాక్స్ క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఆ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది.



చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్, ÷ట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపొతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయి-ంతే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణెళిష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, సత్య.. అక్కడక్కడ నవ్వించారు.

# టికెట్ ధరల పెంపు మెమోలు ఎలా ఇస్తారు

## ధరలు పెంచబోమని మంత్రే స్వయంగా చెప్పారుగా

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తెలంగాణ హైకోర్టు

కొత్త సినిమాల టికెట్ ధరలను పెంచుకునేందుకు అవకాశం కృస్తూ మెమోలు జారీ చేయడంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెవిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించిం. టికెట్ ధరలు పెంచబోమని సంబంధిత మంత్రే స్వయంగా ప్రకటించారని, అయినా కూడా ధరల పెంపునకు మెమోలు ఎందుకు ఇస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసిం. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు మీ ఆలోచన మారడం లేదంటూ మండిపడిం. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా? అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించిం. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది రాజాసాబ్' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు అనుమతించిన సంగతి తెలిసిందే. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌ల్లో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చిం. 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌ల్లో రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చిం. టికెట్ లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేసిం. ఈ నేపథ్యంలో 'రాజాసాబ్' టికెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైం. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని కోర్టుకు వివరించారు.



# ఆస్కార్ రేసులో ఇండియన్ ఫిలిమ్స్

## ముందున్న కాంతారా, మహావతార్ నరసింహ






సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్-15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది. ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ పక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది.

# శివకార్తికేయన్ పరాశక్తి నేడు విడుదల

శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ బడ్జెట్ చిత్రం 'పరాశక్తి' ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు తాజాగా సర్టిఫికేట్‌ను జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సినిమా 1960ల నాటి హిందీ వ్యతిరేక ఉద్యమ నేపథ్యం ఉన్నందున, తొలుత సెన్సార్ బోర్డు 23 కట్స్ సూచించినప్పటికీ, రివైజింగ్ కమిటీ పరిశీలన తర్వాత కొన్ని మార్పులతో క్లియరెన్స్ లభించింది. సుమారు 162 నిమిషాల నిడివి ఉన్న ఈ పీరియాడిక్ పొలిటికల్ డ్రామాలో శివకార్తికేయన్ కాలేజీ విద్యార్థిగా కనిపించనున్నారు. ఈ సినిమా తమిళ వెర్షన్ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




అయితే తెలుగులో సంక్రాంతి సినిమాల రద్దీ మరియు థియేటర్ల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా, తెలుగు వెర్షన్ విడుదలను జనవరి 23కి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జయం రవి, అథర్వ మురళి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ సినిమా కావడం విశేషం.

# జన నాయగన్' సినిమాకు ఊరట

## సెన్సార్ సర్టిఫజకెట్ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం

విజయ్ కథానాయకుడిగా నటించిన 'జన నాయగన్' సినిమాకు ఊరట లభించింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. గత డిసెంబరులో సెన్సార్ కోసం జన నాయగన్ సినిమాను పంపగా అభ్యంతరకర మైన సన్నివేశాలు తొలగించాలని, కొన్ని సంభాషణలు మ్యూట్ చేయాలని సూచించినట్లు సమాచారం. ఆ మేరకు మార్పులు చేసిన నిర్మాణ సంస్థ మళ్లీ సెన్సార్‌కు పంపగా బోర్డు నుంచి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్ తరపున మద్రాసు హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది. తొలుత యూ/ఏ సర్టిఫికేషన్‌కు సిఫార్సు చేసిన సెన్సార్ బోర్డు.. ఆ తర్వాత సినిమాను రివ్యూ కమిటీకి పంపిందని నిర్మాణ సంస్థ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. తాజాగా ఈ అంశంపై హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. సినిమాకు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మళ్లీ రివ్యూ కమిటీకి పంపాల్సిన అవసరం ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ముందుగా ఇస్తామన్న యూ/ఏ సర్టిఫికెట్ తక్షణమే ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. సింగిల్ జడ్జి తీర్పుపై సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ముందు అత్యవసర విచారణ కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తాజా తీర్పుతో 'జననాయగన్' విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలోనే సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోన్నట్లు సమాచారం.



# యాక్షన్ మోడల్‌లో సమంత సూపర్బ్

చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది..' అంటూనే ఫుల్ యాక్షన్ మోడ్‌లో అదరగొడుతున్నారు సమంత. ఆమె ప్రధానపాత్రలో నందిని రెడ్డి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. తాజాగా ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సమంత అమాయకంగా కనిపిస్తూనే యాక్షన్ సన్నివేశాల్లో తనదైన శైలిలో నటించారు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు ఈ వీడియో ఆధారంగా తెలుస్తోంది. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సీఎం చంద్రబాబు రాక



**సూళ్లూరుపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఈ నెల 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ ఉత్సవానికి చివరి రోజు అయిన జనవరి 12న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. హెలిప్యాడ్ ఏర్పాటు సహా అవసరమైన అన్ని సన్నాహాలు పూర్తి చేశామని, ముఖ్యమంత్రి పర్యటనకు అనుగుణంగా స్వల్ప మార్పులతో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పక్షుల ప్రేమికులు, పర్యాటకులు ఈ మూడు రోజులు నేలపట్టు, అటకానితిప్ప, బీవీ పాలెం ప్రాంతాలను సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఉప్పునీటి సరస్సైన పులికాట్ సరస్సు తీరాన ప్రతి ఏటా ఘనంగా నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. పులికాట్ ప్రాంతంలో గతంలో ఎన్నో సంవత్సరాలుగా ఈ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించామని, గత సంవత్సరం ప్రభుత్వం దీనిని పునరుద్ధరించి స్టేట్ ఫెస్టివల్‌గా, మెగా ఫెస్టివల్‌గా ప్రకటించిందన్నారు. ఈ ఏడాది మొదటగా జనవరి 10, 11 తేదీల్లో ఫెస్టివల్ నిర్వహించాలని నిర్ణయించామని, అయితే ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సందర్శకుల స్పందన, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్యే సూచనలు, స్థానిక రాజకీయ కమిటీ సలహాల మేరకు జనవరి 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఫెస్టివల్‌కు సంబంధించిన ఈవెంట్లు, కార్యక్రమాల వివరాలను ఇప్పటికే ఎమ్మెల్యేతో కలిసి మీడియా మిత్రులకు వివరంగా తెలియజేశామని తెలిపారు. జనవరి 12వ తేదీ సాయంత్రం సుమారు 3:30 నుంచి 4:00 గంటల మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూళ్లూరుపేటకు విచ్చేయనున్నారని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి నేలపట్టు లేదా అటకానితిప్ప ప్రాంతాల్లోని ఫ్లెమింగో పాయింట్‌ను సందర్శించి, అనంతరం సూళ్లూరుపేట జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్‌లో నిర్వహించే పబ్లిక్ ప్రోగ్రామ్‌లో పాల్గొంటారన్నారు. ఈ మూడు రోజుల ఫెస్టివల్‌లో భాగంగా నేలపట్టు బర్డ్ శాంక్చురీ, అటకానితిప్ప ఫ్లెమింగో పాయింట్స్, సూళ్లూరుపేట జెడ్పిహెచ్ఎస్ స్కూల్‌లో వివిధ ఈవెంట్లు, స్టాల్స్, బీవీ పాలెంలో బోటింగ్ పాయింట్, ఉబ్బల మడుగులో వాటర్ ఫాల్స్, శ్రీసిటీ ప్రాంతంలో రెండు రోజుల పాటు వర్క్‌షాప్, సింపోజియం, అడ్వెంచర్ టూరిజం, ఎకో టూరిజం కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పులికాట్ సరస్సు టూరిజాన్ని దృష్టిలో పెట్టుకుని ఐలాండ్ టూరిజం, లేక్ టూరిజం కాన్సెప్ట్‌తో పాటు కొరిడి, పెర్నాడు వంటి ద్వీప మార్గాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సూళ్లూరుపేట--నాయుడుపేట ప్రాంతం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతూనే, అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నందున ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మొట్టమొదటిసారిగా ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతున్న నేపథ్యంలో, పులికాట్ సరస్సు ముఖద్వారంలో పేరుకుపోయిన పూడికతీత సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశను ఏళ్ల నాటి మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెంగాళమ్మ ఆలయం పక్కన ఉన్న బ్రిడ్జి, వేనాడు, కొరిడి, పేర్నాడు రహదారి సమస్యలు కూడా పరిష్కార దిశగా అడుగులు పడతాయనే నమ్మకంతో నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌కు ముఖ్యమంత్రి పాల్గొనడం ఎంతో సంతోషకరమని పేర్కొన్న కలెక్టర్, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఎస్పీ, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, ఎమ్మెల్యే తదితర అధికారులతో సమన్వయంతో చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, మునిసిపల్ ఛైర్మన్ శ్రీమంత్ రెడ్డి, టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి జనార్దన్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ చెన్నయ్య, డీఎస్‌డీఓ శశిధర్, సెట్విన్ సీఈఓ యశ్వంత్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఆర్ అండ్ బీ ఎస్సీ రాజా నాయక్, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

**అన్ని భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందే**

**ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తప్పవు**

**అధిక ధరలు వసూలు చేస్తే కేసులు నమోదు**

**సంయుక్త రవాణా కమిషనర్ (జేటీసీ) ఎ.మోహన్**



**విజయవాడ:** ప్రయాణికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రయాణికులపట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వాహనాల్లో తప్పనిసరిగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని.. సంయుక్త రవాణా కమిషనర్ (జేటీసీ) ఎ.మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేసినా, దురుసుగా ప్రవర్తించినా ఊరుకునేది లేదన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. సంక్రాంతి నేపథ్యంలో స్థానిక డీటీసీ కార్యాలయంలో శుక్రవారం నాడు ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు, ప్రతినిధులతో సమావేశంను నిర్వహించామన్నారు. సంక్రాంతి పండగను ఆసరాగా తీసుకొని కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యజమానులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తున్నాయని, అలాంటి వాహనాలపై కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేయడం కూడా జరుగుతుందన్నారు. ప్రయాణికులకు నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే మోటారు వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి, విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, ఇతర ప్రయాణ వాహనాలు తప్పనిసరిగా ప్రయాణికుల వివరాలను, వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహన యజమానులు, డ్రైవర్ల నుంచి ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా 9281607001 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చని జేటీసీ ఎ.మోహన్ సూచించారు.

# ఉపాధి కుట్రలపై 18నుంచి చైతన్య కార్యక్రమం

**ఇంటింటికి తిరిగి ప్రచారం చేపడతాం**

**ప్రజల భూములను 99 పైసలకే ఎలా ఇస్తారు**

**మంత్రి లోకేశ్ తీరుపై మండిపడ్డ సిపిఎం నేత శ్రీనివాసరావు**

**విజయవాడ :** ఉపాధిహామీపై కుట్రలను వివిరిస్తూ... సిపిఎం ఆధ్వర్యంలో జనవరి 18 నుండి ఇంటింటికి తిరిగి చైతన్య ప్రచారం చేపడుతున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటించారు. శుక్రవారం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ . ఉపాధి హామీ చట్టం విషయంలో 100 రోజులను 150 రోజులు చేసినట్లుగా ప్రత్యేకంగా చెబుతున్నారు. కానీ దీనికోసం ప్రత్యేకమైన చట్టం తీసుకురానక్కరలేదన్నారు. పాత చట్టాన్నే 150 చేస్తే సరిపోద్ది కదా అన్నారు. వామపక్షాలు కూలీలతో కలిసి ఉపాధి హామీ చట్టం విషయంలో 200 రోజులు చేయాలని, రూ.600 కనీసం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. అయితే ఈరోజు ఆచరణలో కనీసం 50 రోజులు కూడా లేవన్నారు. కనీస వేతనాన్ని నిర్ణయిస్తే రూ.250 కూడా రావడం లేదన్నారు. దాన్ని అభివృద్ధి చేయాల్సిందిపోయి మొత్తాన్నీ నాశనం చేసి చట్టాన్నే మార్చేసి పథకాన్ని ఎత్తేసే కుట్ర జరుగుతుందని ధ్వజమెత్తారు. దీనిని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జనవరి 18 నుండి 31వ తేదీ వరకు ర్యాలీల ద్వారా ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించారు. ప్రతీ ఇంటికి తిరిగి కరపత్రం ఇచ్చి వారికి వాస్తవాలను చెప్పి సంతకాలను సేకరించి అధికారులకు కూడా మహజర్లను ఇస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే, పాత చట్టాన్ని పునరుద్ధరించకపోతే ఒక జాతీయ స్థాయి ఉద్యమాన్ని చేపట్టేందుకు వామపక్ష పార్టీలన్నీ సన్నద్ధమవుతున్నాయని ఉద్ఘాటించారు. వ్యవసాయ కూలీలు, పేద రైతులు, చేతి వృత్తిదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అత్యధిక పేద ప్రజానీకం ఈ వాస్తవాలను గుర్తించి సిపిఎం చేపట్టనున్న ఇంటింటికి ప్రచారాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కూలీ సంఘాలు, ఉపాధి సంఘాలు కలిసి గ్రామగ్రామాల్లో సమావేశాలు పెట్టి వారందరినీ చైతన్యవంతం చేయాలని కోరారు. 14వ తేదీ భోగి పండుగ రోజున ఉపాధి హామీ చట్టాన్ని నాశనం చేస్తున్న కొత్త చట్టాన్ని కూడా భోగి మంటల్లో దగ్ధం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున బలవంతంపు భూసేకరణ జరుగుతుందన్నారు. ఈ భూసేకరణను సమర్థించుకోవడానికి 99 పైసలకిచ్చేస్తాం మీకేంటి ఇబ్బంది అని లోకేశ్ చెబుతున్నారని అన్నారు. గతంలో ఓసారి లోకేష్ మాట్లాడుతూ ? ఉచితంగా ఎవ్వరికీ భూములను ఇవ్వలేదని, ఎవరెవరికి ఎన్ని కోట్ల రూపాయలలో భూములిచ్చారో లెక్కలతో సహా చెప్పారని గుర్తు చేశారు. ఉచితంగా ఎవ్వరికీ భూమిని ఇవ్వడం లేదనీ, మార్కెట్ రేటుకే ఇస్తున్నామని చెప్పి ఇప్పుడు వారు 99 పైసలుకే భూమిని ఇచ్చేస్తాం అని చెప్పడం బరితెగింపేనన్నారు. దున్నుకొని పంటలను పండించే వ్యవసాయ భూములను రైతుల నుండి బలవంతంగా లాక్కొని కార్పొరేట్లకు 99 పైసలకిస్తారా అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సహకరించాల్సిందిపోయి పక్కనే ఆర్సెల్ మిట్టల్ ను పెట్టారని, అటు గంగవరం పోర్టును అదానీకి ఇచ్చేశారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు లేదు వారికి మైన్లు లేవు అని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు చెందిన 2500 ఎకరాలను నక్కపల్లిలో పరిశ్రమలు పెట్టడానికి ప్రయివేటు పార్టీలకు మళ్లించండి అని ఆ రిపోర్టులో స్పష్టంగా ఉందని తెలిపారు. కార్మికులను రాష్ట్ర ప్రజలను మోసం చేయవద్దు అని వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. భూములను ఇష్టానుసారం ఇస్తామని మంత్రి లోకేష్ చెబితే ? దాన్ని అడ్డగించినందుకు పార్టీ వ్యక్తి అప్పలరాజును తీసుకెళ్లి డిటైన్ చేశారని దుమ్మెత్తిపోశారు. ఈరకంగా ఎంతమందిని నిర్బంధించి ఎన్ని అక్రమ కేసులు పెట్టి ఎంతమందిని బెదిరించి భూములను లాక్కుంటారు అని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. వైఎస్.జగన్ ఉన్నప్పుడు తాము ప్రతిఘటిస్తే మీకు బాగుంది.. పక్కనే వచ్చి కూర్చొని బలపరిచారు.. ధర్నాల్లో కూడా కూర్చున్నారు.. ఆ రోజు తప్పు కాదు.. ఈరోజు తప్పయిందా అని వి.శ్రీనివాసరావు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇష్టానుసారం బాధ్యతారాహిత్యంగా ఒక మంత్రి ఇలా అపరిపక్వంగా మాట్లాడుతూ సిపిఎం లాంటి ఒక జాతీయ పార్టీపై అపనిందలు మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎవరో రాసిన స్క్రిప్టును చదివేటంత తెలివితక్కువ వాళ్లం తాము కాదు అని చెప్పారు. రైతులను బాధపెట్టి వారి పొట్టగొట్టి ఎవరిని పోషిస్తారు ? అదానీ అంబానీలనా మీరు పోషించేది ? అని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు.


## సిఆర్ఎస్ రైల్వే హాస్పిటల్ ఉద్యోగుల సమస్యలపై ఎంపీ గురుమూర్తి సానుకూల హామీ



**తిరుపతి:** రేణిగుంటలోని సిఆర్ఎస్ రైల్వే హాస్పిటల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి హామీ ఇచ్చారు. రేణిగుంటలోని సిఆర్ఎస్ రైల్వే హాస్పిటల్‌కు చెందిన ఉద్యోగులు ఎంపీని మర్యాదపూర్వకంగా కలసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, హాస్పిటల్‌లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన కనీస వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో లేవని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నామని తెలిపారు. ముఖ్యంగా రిఫరల్ వైద్యం కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు సరిపోవడం లేదని, పెద్ద చికిత్సలు అవసరమైన సందర్భాల్లో గుంతకల్లు డివిజన్ హాస్పిటల్‌కు వెళ్లాల్సి రావడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో సమయానికి వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. హెచ్ఆర్ఏ పెంపు అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఉద్యోగులు ఎంపీని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ గురుమూర్తి, గతంలోనే తిరుపతి పట్టణాన్ని టైర్--1 నగరంగా పరిగణించి హెచ్ఆర్ఏ పెంచాల్సిందిగా పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ అంశంపై మరోసారి సంబంధిత మంత్రిత్వ శాఖతో చర్చించి, సిఆర్ఎస్ ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని స్పష్టం చేసిన ఎంపీ గురుమూర్తి, త్వరలోనే సిఆర్ఎస్ రైల్వే హాస్పిటల్‌ను స్వయంగా సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని తెలిపారు.

## ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా కట్టుదిట్టమైన ట్రాఫిక్ ఏర్పాట్లు

**సిఐ ఎం.మురళీకృష్ణ**



**సూళ్లూరుపేట:** ఈ నెల 10, 11, 12 తేదీలలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు విస్తృత ట్రాఫిక్ మార్గదర్శకాలు విడుదల చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చే సందర్శకులు, విద్యార్థుల దృష్ట్యా పట్టణంలో ట్రాఫిక్ సజావుగా కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సిఐ ఎం. మురళీకృష్ణ తెలిపారు. ఫెస్టివల్‌కు వచ్చే ఫ్రీ చిల్డ్రన్స్ బస్సులు, రెగ్యులర్ ఆర్టీసీ బస్సులు చెంగాలమ్మ దేవాలయం వైపు నుంచి ఆర్టీసీ బస్‌స్టాండ్ మీదుగా హోలీ క్రాస్ జంక్షన్ ద్వారా నెల్లూరు, చెన్నై వైపు లేదా ఆటకానితిప్పకు వెళ్లాలని సూచించారు. అలాగే ఆటకానితిప్ప, నేలపట్టు, బీవీ పాలెం నుంచి వచ్చే ఫ్రీ చిల్డ్రన్స్ బస్సులు కూడా ఇదే మార్గాన్ని అనుసరించాల్సి ఉంటుంది. శ్రీసిటీ, అపాచీ, మాంబట్టు పారిశ్రామిక ప్రాంతాల నుంచి వచ్చే ప్రైవేట్ బస్సులు హోలీ క్రాస్ నుంచి వై జంక్షన్ వరకు మాత్రమే అనుమతించబడతాయి. జనవరి 10, 11 తేదీలలో హోలీ క్రాస్ సర్కిల్ లేదా చెంగాలమ్మ దేవాలయం వైపు నుంచి జీఎన్‌టీ రోడ్ ద్వారా పట్టణంలోకి ప్రైవేట్ బస్సుల ప్రవేశం పూర్తిగా నిషేధించడంతో పాటు, టౌన్‌లో ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌కూ అనుమతి ఉండదని స్పష్టం చేశారు. సూళ్లూరుపేట కాలేజీ గ్రౌండ్‌కు వచ్చే ద్విచక్ర వాహనదారుల కోసం స్కూల్ తూర్పు, ఉత్తర వైపులు, సిఎంఆర్ షాపింగ్ సమీపం, ఆర్టీసీ బస్‌స్టాండ్ వెనుక వైపు పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్, కాలేజీ గ్రౌండ్ ఎదురుగా ఉన్న జీఎన్‌టీ రోడ్‌లో ద్విచక్ర వాహనాల పార్కింగ్ నిషేధమని పేర్కొన్నారు. కాలేజీ గ్రౌండ్‌లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్‌కు వచ్చే ప్రైవేట్ బస్సులు, టెంపో ట్రావెలర్స్, కార్లు చెంగాలమ్మ దేవాలయం ఎదురు, శ్రీనగర్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపివేయాలని సూచించారు. పాస్‌లు ఉన్నవారు తమ కార్లను రైల్వే స్టేషన్ రోడ్‌లోని వేనాటి వారి కాంప్లెక్స్ గ్రౌండ్‌లో పార్క్ చేసి, ప్రత్యేక ప్రవేశ మార్గం ద్వారా కాలేజీ గ్రౌండ్‌లోకి వెళ్లాలని తెలిపారు. ప్రజల ప్రవేశం కోసం జీఎన్‌టీ రోడ్ వైపు ఉన్న పశ్చిమ ద్వారం, కాలేజీ తూర్పు వైపు ప్రధాన ద్వారాలు ఉపయోగించుకోవాలని, బయటకు వెళ్లేందుకు ఆర్ అండ్ బీ కార్యాలయం సమీపంలోని నైరుతి మార్గం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలేజీ ఉత్తర వైపున ఉన్న చిన్న ద్వారం ద్వారా కూడా రాకపోకలు సాగించవచ్చని చెప్పారు. రైల్వే స్టేషన్ నుంచి వచ్చే ప్రయాణికులు పోస్టాఫీస్ నుంచి కాపు వీధి ద్వారా ప్రధాన రోడ్డుకు చేరుకోవాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు అయిన జీఎన్‌టీ రోడ్, హోలీ క్రాస్ నుంచి వై జంక్షన్ మీదుగా షార్ రోడ్డులో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే క్రేన్ ద్వారా తొలగించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలను తీసుకువచ్చే యాజమాన్యాలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అత్యంత జాగ్రత్తగా తీసుకువచ్చి తిరిగి చేర్చాలని కోరారు. ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని సీఐ ఎం.మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## రాజ్యసభలో జూన్‌లో ఐదు ఖాళీలు

**తెలంగాణలో ఇద్దరు, ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు రిటైర్**

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది రిరైట్ అవుతున్న రాజ్యసభ సభ్యుల జాబితాను శుక్రవారం రాజ్యసభ సచివాలయం విడుదల చేసింది. తెలంగాణలో భారాస సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్‌మను సింఘ్వీ ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైకాపా ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, తెదేపా సభ్యుడు సానా సతీష్‌ల పదవీకాలం ఈ ఏడాది జూన్‌తో ముగుస్తుందని రాజ్యసభ సచివాలయం తెలిపింది. ఈమేరకు అన్ని రాష్ట్రాల సభ్యుల పదవీకాలం వివరాలను వెల్లడించింది.

# తెలుగు వారి సంస్కృతీ, సాంప్రదాయానికి ప్రతీక కొండపల్లి బొమ్మలు

**ప్రపంచానికి తెలుగువారిచ్చిన విలువైన బహుమతి కొండపల్లి బొమ్మలు**

**యూరోపియన్ యూనియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్**





**విజయవాడ:** ప్రాచీన చరిత్ర, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహితమైన తయారీ విధానం అంతర్జాతీయ స్థాయిలో కొండపల్లి హస్తకళల పేరు ప్రఖ్యాతలకు ముఖ్య కారణమని యూరోపియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్ తెలిపారు. తెలుగువారి కళా వైభవానికి నిలువుటద్దం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి హస్తకళలను శుక్రవారం కొండపల్లిలోని ఏపీ టూరిజం శాఖ నిర్వహిస్తున్న కొండపల్లి ఎక్స్పీరియన్స్ సెంటర్ ను యూరోపియన్ యూనియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తో కలిసి పరిశీలించారు. స్థానికుల సంక్రాంతి ముగ్గులతో సాంప్రదాయ స్వాగతంతో అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్ పర్యటన ప్రారంభమైంది. సాంప్రదాయ హారతి, పూల దండలతో రాయబారిని తిలకందిద్ది స్వాగతించగా, వీధి మొత్తం సప్తవర్ణ ముగ్గులతో అలంకరించబడిన పండుగ వాతావరణంగా మారింది. ఈ ప్రాంతమంతా సంక్రాంతి ముందుగానే వచ్చిన స్ఫూర్తిని ప్రజల మనస్సుల్లో రేకెత్తించింది. దీనికితోడు సంక్రాంతి గొబ్బెమ్మల పాటలకు రాయబారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియాలు స్థానిక మహిళలతో కలిసి పాటలు పాడుతూ నృత్యాలు చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈయూ రాయబారి ఎక్స్పీరియన్స్ సెంటర్ ను సందర్శించి అందులో బొమ్మల తయారీ విధానాన్ని, వాటి ధరలను కళాకారుల నుండి అడిగి తెలుసుకున్నారు. సాదాసీదా పొనికి కర్రతో కళాకారుల చేతుల్లో ప్రాణం పోసుకుని, అద్భుత శిల్పాలుగా మారే ప్రక్రియను చూసి ఆయన ముగ్ధులయ్యారు. కేవలం బొమ్మలను బొమ్మలగానే కాకుండా, ఆ బొమ్మల వెనుక ఉన్న శతాబ్దాల నాటి చరిత్రను, హస్తాకళాకారుల మనోభావాలను, వారి అంకితభావాన్ని అంబాసిడర్ కొనియాడారు. ప్రతి బొమ్మ ఒక కథ చెబుతోంది, ప్రతి రంగు ఒక సంస్కృతిని ప్రతిబింబిస్తోంది అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించటం ఆయనను ఈ పర్యటన ఎంత హత్తుకుందో చెప్పకనే చెపుతుంది. ఐరోపా దేశాలకు, భారతీయ గ్రామీణ కళలకు ముఖ్యంగా తెలుగువారి సాంస్కృతిక వైభవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రోత్సాహం ఎంతో అద్భుతంగా ఉందనటానికి ఈ పర్యటన ఒక గొప్ప సాంస్కృతిక వారధిలా నిలుస్తుందని, హస్తకళాకారుల నైపుణ్యం ప్రపంచ స్థాయి ప్రశంసలకు అర్హమని ఆయన పేర్కొన్నారు. స్థానిక సభ్యులు రమణరావు, తదితరలు రాయబారికి కొండపల్లి బొమ్మలను బహుకరించారు. ఈ సందర్భంగా హెర్వే డెల్ఫిన్ మాట్లాడుతూ.. "కొండపల్లి కళాకారుల వేళ్ల కొనల్లో అద్భుతమైన మ్యాజిక్ ఉంది. ఒక సామాన్యమైన చెక్క ముక్కను అపురూపమైన కళాఖండంగా మార్చడం నిజంగా అద్భుతం. ఈ వారసత్వాన్ని కాపాడుతున్న కళాకారులకు నా అభినందనలు. ఈ పర్యటనలో ఆయన కళాకారులతో ముచ్చటించి, బొమ్మల తయారీలోని మెళకువలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కొండపల్లి ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన ఈ సందర్శన, స్థానిక కళాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత శక్తివంతమైన జీవన చేతిపనుల సంప్రదాయాలలో ఒకటైన కొండపల్లి హెరిటేజ్ స్ట్రీట్, ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను సందర్శించడంతో, కొండపల్లిలోని చారిత్రాత్మక వారసత్వ వీధి రంగులు, చేతిపనులు మరియు వేడుకలతో సజీవంగా మారింది. పార్క్ హయత్ హెూటల్ ల్లో ఈయూ రాయబారి ఆంధ్రా వంటకాలు సాంప్రదాయమైన అరటికాయ అరిటాకులో భోజనం చేశారు.. ఘాటైన 'గుంటూరు గోంగూర పచ్చడి', 'నాటుకోడి పులుసు' రుచికి ఆయన ఆశ్చర్యపోయారు. రాయలసీమ స్పెషల్ 'ఉలవచారు', నెల్లూరు 'చేపల పులుసు' అంబాసిడర్‌ను విశేషంగా ఆకట్టుకున్నాయి. నోరూరించే 'పూతరేకులు', వేడి వేడి 'బొబ్బట్లు, పులిహెూర' తిన్న తర్వాత, "యూరప్ డెజర్ట్ లకు ఇవి ఏమాత్రం తీసిపోవు" అని అంబాసిడర్ ప్రశంసించారు. "ఆంధ్ర వంటకాల్లోని సుగంధ ద్రవ్యాలు, వాటి వెనుక ఉన్న సంప్రదాయం అద్భుతం. ఇక్కడి ప్రజల ఆత్మీయత ఆ వంటకాల్లో కనిపిస్తోందని అని అంబాసిడర్ పేర్కొన్నారు. స్టార్ హెూటల్స్ అధ్యక్షులు రామిశెట్టి వీరాస్వామి కూడా రాయబారితో ఉన్నారు. గుణదల పార్క్ హైయత్ హెూటల్లో మధ్యాహ్న భోజనం అనంతరం మాట్లాడుతూ... యూరోపియన్ దేశాల సాంకేతికత, పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సుదీర్ఘ తీరప్రాంతాన్ని ఒక ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చేందుకు బ్లూ వ్యాలీ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించినట్లు ఈయూ రాయబారి హెర్వే డెల్ఫిన్ తెలిపారు. సముద్ర వనరుల స్థిరమైన వినియోగం, తీరప్రాంత అభివృద్ధి, సముద్ర ఆధారిత పరిశ్రమల వృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించే వీలుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాల్లో సహకారంపై చర్చించామన్నారు. ఆవకాయ్-అమరావతి ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొనడం ఒక గొప్ప అనుభూతిని కలిగించిందని.. ఆ కార్యక్రమంలో ప్రదర్శించిన సంగీత, నృత్య ప్రదర్శనలను ఆశ్వాదించానన్నారు. త్వరలో దిల్లీలో ఈయు- ఇండియా సమ్మిట్ జరగనుందన్నారు. ఈయూ సమాఖ్య నాయకలు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వివిధ అంశాలపై చర్చించి ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ పై సంతకాలు చేసే వీలుందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న 6,000 ఐరోపా కంపెనీల సంఖ్య, పెట్టుబడులు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ కంపెనీల ద్వారా సుమారు 3.8 మిలియన్ల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఐరోపాలో చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, వారికి స్కాలర్‌షిప్‌లు, ఇతర నైపుణ్య శిక్షణలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. గత ఏడాది రికార్డు స్థాయిలో 9 లక్షల మంది భారతీయులు ఐరోపాకు వీసాలు పొందారన్నారు. రానున్న రోజుల్లో విద్య, వ్యాపారం, సంస్కృతి, పర్యాటక రంగాల్లో సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఈయూ రాయబారి హెర్వే డెల్ఫిన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**



**చల్లపల్లి:** విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి నారాయణరావు నగర్ 15వ ఫైనాన్స్ కమీషన్ హెల్త్ గ్రాంట్స్ నిధులు రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, చల్లపల్లి మండలంలో ఐదు ఆరోగ్యకేంద్రాల నిర్మాణానికి రూ.1.80కోట్లు, అవనిగడ్డ నియోజకవర్గంలో 14 ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.5.04కోట్లు మం జూరైనట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న 15 భవనాలను పూర్తిచేసేందుకు రూ.1.36కోట్లు మంజూరు చేశారన్నారు. పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టారనీ, నారాయణరావునగర్ కాలనీలో పేదలకు ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా పేదప్రజలకు వైద్యసౌకర్యాలు అందిస్తోందనీ, నగదు చెల్లించి వైద్యం చేయిం చుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్దఎత్తున సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో సీఎం సహాయనిధి కింద రూ.7కోట్లు మంజూరుచేసినందుకు ముఖ్యమం త్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మానవతా ధృక్పథంతో సహాయనిధి మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత ఐదేళ్ల విధ్వంసం కారణంగా ఎన్నో సమస్యలు ఉన్నాయనీ, ఆర్థిక వెసులుబాటు ఆధారంగా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. నారాయణరావునగర్లో రహదారుల సమస్య పరిష్కారానికి కృషిచేసు న్నట్లు తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. సాక్కి నిధులు తీసుకువచ్చి రహదారుల అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో పల్లెపండుగలో రూ.1.07 కోట్లతో 18కిలోమీటర్ల మేర 18 సిమెంటు రహదారులను నిర్మించినట్లు తెలిపారు. పల్లెపండుగ రెండవ విడతలో రూ.67లక్షలు మం జూరైనట్లు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.55కోట్లతో 503 పనులు చేపట్టేందుకు ప్రతి పాదనలు పంపామనీ, నిధుల మంజూరుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్లు బోలెం నాగమణి, పైడిపాముల స్వప్న, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, డీఈ పగడాల సురేష్ బాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ, ఈవో పివి. మాధవేంద్రరావు, వార్డుసభ్యులు అంబటి భువనేశ్వరరావు, షేక్ సిలార్, నేతలు షేక్ నబీఘోరి, రావి చిట్టి, అడపా రాంబాబు, మిరియాల జితేంద్ర, రావి రాజు, ప్రెస్ పూర్ణ, వరదా హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు.. ఆడిటర్లకు దిశానిర్దేశం



**శ్రీసిటీ:** జీఎస్టీ 2.0 భారతదేశ పరోక్ష పన్నుల వ్యవస్థకు రీసెట్‌లాంటిదని, ఇది పన్ను విధానాన్ని మరింత సరళీకృతం చేసి, వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ గుంటూరు ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పీ. ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. ఆడిటర్ల పాత్ర కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా, సలహాదారులు, రిస్క్ మేనేజ్‌మెంట్ నిపుణులు, డిజిటల్ అనుసరణ మార్గదర్శకులుగా మారనుందని తెలిపారు. కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ), శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం శ్రీసిటీలో నిర్వహించిన జీఎస్టీ 2.0 సంస్కరణలు, ఆడిటర్ల పాత్రపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తిరుపతి రీజియన్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నాగరాజ్ కమిషనర్‌ను సభకు పరిచయం చేస్తూ, సమావేశం ఉద్దేశ్యాన్ని వివరించారు. ఉపన్యాసం అనంతరం పాల్గొనేవారు తమ సందేహాలను నేరుగా అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, కమిషనర్ ఆనంద్ కుమార్‌తో తనకున్న దీర్ఘకాల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. శ్రీసిటీ ప్రారంభ దశలో ఆయన అందించిన సేవలు విలువైనవని పేర్కొన్నారు. ఇటువంటి అవగాహన సదస్సులు వ్యాపార సంస్థలకు, ముఖ్యంగా బహుళజాతి కంపెనీలకు విధాన మార్పులను సులభంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, 2025 సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ 2.0, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'వికసిత్ భారత్ 2047' దృక్పథనికి ప్రతిరూపమని అన్నారు. 5 శాతం, 18 శాతం అనే రెండు స్లాబ్‌లతో కూడిన కొత్త పన్ను విధానం ఇంటి ఖర్చులను తగ్గించడంతో పాటు సుస్థిర ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. మెరుగైన ఈ-ఇన్వాయిసింగ్ విధానం, వేగవంతమైన రీఫండ్‌లు, కాగితరహిత ఆడిట్‌లతో అనుసరణ సులభమైందని, పన్ను ఎగవేతకు అడ్డుకట్ట పడుతోందని తెలిపారు. అలాగే, జీఎస్టీ 2.0 సంస్కరణలు ఆడిటర్ల పాత్రను కొత్త దిశలో నిర్వచిస్తున్నాయని, ఇకపై వారు వ్యూహాత్మక సలహాదారులుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మార్పుల దశలో కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, ఈ సంస్కరణలు పారదర్శకతను, పోటీతత్వాన్ని, సమగ్ర వృద్ధిని ప్రోత్సహిస్తూ భారతదేశ దీర్ఘకాలిక ఆర్థిక రూపాంతరానికి బలమైన పునాది వేస్తాయని స్పష్టం చేశారు. ఈ సదస్సులో శ్రీసిటీకి చెందిన 100కుపైగా పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని జీఎస్టీ 2.0 అమలుపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వ్యాపార అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడంలో శ్రీసిటీ తన నిబద్ధతను ఈ కార్యక్రమం ద్వారా మరోసారి చాటుకుంది.

## విజయ అకాడమీలో సంక్రాంతి సంబరాలు



**చల్లపల్లి:** సంక్రాంతి ముందేవచ్చిందా అన్నట్లుగా స్థానిక విజయా ఆకాడమీలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కావటంతో చిన్నారులు, విద్యార్థినీ విద్యార్థులు కొత్త దుస్తులు ధరించి పాఠశాలకు వచ్చారు. పలువురు చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో రావటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా భోగిమంటలు, పాలపొంగళ్లు, బొమ్మల కొలువు, హరిదాసుల వేషధారణలతో పండుగ వాతావరణం ఉట్టిపడింది. ఎల్ కేజీ, యుకేజీ చిన్నారులకు ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, హెచ్ఎం కోటేశ్వరి దంపతులు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేసి కేరింతలు కొట్టారు.



## అలరింపజేసిన ఆవకాయ సాంస్కృతికోత్సవం





**విజయవాడ:** ఆవకాయ్... సినిమా, సంస్కృతి, సాహిత్యాల అమరావతోత్సవం రెండో రోజు శుక్రవారం సాయంత్రం పున్నమిఘాట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు ప్రేక్షకులకు కొత్త మధురానుభూతులను అందించాయి. దుర్గమ్మ చల్లని నీడలో కృష్ణమ్మ చెంత సాంస్కృతిక సౌరభాల సంగమం సరికొత్త మాధుర్యానికి చేరువ చేసింది. కర్ణాటక, ఆధ్యాత్మిక సంగీత విభావరి మన సంప్రదాయ సాంస్కృతిక విశిష్టతను గుర్తుచేసింది. వనశ్రీరావు.. కూచిపూడి నృత్యం.. రస ఐక్యం ప్రేక్షకుల మదిలో పదిలమైన ముద్ర వేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. కలలకు కదలిక ఇచ్చే కళ సినిమాకు సంబంధించి పాటల రచన, సాహిత్యానికి సంబంధించి సినీ రంగ ప్రముఖులతో జరిగిన చర్చా గోష్టి ఆధునిక సినిమా సాహిత్య ధోరణులను కళ్లకుకట్టింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులు కార్యక్రమాలకు హాజరై.. కళాకారులను అభినందించారు.